

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 25-02-2025 | సంపుటి - 21 | సంచిక - 307 | రూ : 4 | పేజీలు: 8




# గోల్కొండ 6.. చార్మినార్ 9

- టాప్-10లో హైదరాబాద్ చారిత్రక ప్రదేశాలు
- అత్యధిక దేశీయ పర్యాటకుల సందర్శనతో రికార్డు
- భారత పురావస్తు శాఖ నివేదిక వెల్లడి



హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరానికి మణిహారంగా నిలుస్తున్న గోల్కొండ కోట, చార్మినార్‌లు పర్యాటక రంగంలో అరుదైన గుర్తింపును సాధించాయి. దేశంలోనే అత్యధిక పర్యాటకులు సందర్శించిన చారిత్రక ప్రదేశాల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. భారత పురావస్తు శాఖ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాఏఎస్ఐ) 202324 సంవత్సరంలో దేశీయ పర్యాటకులు సందర్శించిన టాప్10 ప్రదేశాల జాబితాను సోమవారం విడుదల చేసింది. అందులో గోల్కొండ కోట ఆరో స్థానంలో, చార్మినార్ తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఆగ్రాలోని ప్రసిద్ధ తాజ్‌మహల్ ఈ జాబితాలో 61 లక్షల మంది దేశీయ సందర్శకులతో అగ్రస్థానంలో నిలిచింది.

**కొవిడ్ తర్వాత 30% వృద్ధి**

కరోనాతో కుదేలైన తెలంగాణ పర్యాటకరంగం క్రమంగా కోలుకుంటోంది. దీనికి పురావస్తు శాఖ తాజా జాబితానే నిదర్శనం. మహమ్మారి విజృంభణ తర్వాత హైదరాబాద్ పర్యాటకం దాదాపు 30% వృద్ధిని కనబర్చింది. నగరానికి పురాతన చరిత్ర ఉండటం, రుచికరమైన వంటకాలు లభిస్తుండడం, ఆధునిక మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే ఇందుకు ప్రధాన కారణాలు.

తరువాయి 2లో

## భారాసను ..
# కాపాడుతోంది భాజపానే

- ఫోన్ ట్యాపింగ్ కేసుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణ
- రాష్ట్రానికి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు
- కమలం, గులాబి పార్టీల మధ్య చీకటి ఒప్పందం
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి విమర్శలు
- బీసీగణనలో తమ లెక్కలు తప్పని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని స్పష్టీకరణ
- పనితీరును చూసి ఓట్లేయాలని పట్టభద్రులకు పిలుపు

ఆదిలాబాద్: ''ఫోన్ ట్యాపింగ్ కేసులో సూత్రధారులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దాచిపెట్టారు. వారిని దేశానికి రప్పించాలని నేను స్వయంగా కేంద్రానికి లేఖ రాస్తే పట్టించుకోని సంజయ్... ఇక్కడేమో కేసీఆర్, కేటీఆర్‌లను ఎందుకు అరెస్టు చేయడం లేదని మాపై విమర్శలు చేస్తున్నారు. అమెరికాలో దాక్కున్న వాళ్లను దేశానికి రప్పిస్తే 24 గంటల్లోనే అరెస్టు

తరువాయి 2లో



# అభివృద్ధిలో కలిసిరండి




- పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వ సహకారం
- 'చైనా ప్లస్ వన్' గమ్యస్థానంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నాం
- 'అమ్‌జెన్' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఈ ఏడాది రూ.1,600 కోట్ల పెట్టుబడులు
- సంస్థ ఛైర్మన్ రాబర్ట్ ఎ.బ్రాడ్‌వే

హైదరాబాద్ రాయదుర్గం : తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పరిశ్రమలు కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రం ఇప్పటికే లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్ రంగాల్లో అగ్రగామిగా ఉందని, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో అడుగులేస్తోందని చెప్పారు. చైనా ప్లస్ వన్ గమ్యస్థానంగా, ప్రపంచంలోని గొప్ప నగరాల్లో ఒకటిగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనే

తరువాయి 2లో



## మల్లన్నకు వైభవంగా పుష్పపల్లకి సేవ

* శ్రీశైలం ఆలయం : నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆరో రోజు సోమవారం రాత్రి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి పుష్పపల్లకి సేవ నిర్వహించారు. భక్తజనం శివనామస్మరణల మధ్య గంగాధర

తరువాయి 2లో

## తెలంగాణలో పెరిగిన ర్యాన్సమ్‌వేర్ దాడులు, డిజిటల్ మోసాలు

- ఉపముఖ్యమంత్రి సైట్‌తో పాటు పలు ప్రభుత్వ సైట్లపై హ్యాకర్ల దాడి

బిజినెస్‌బ్యూరో: తెలంగాణ రాష్ట్రంలో సైబర్ దాడులు పెరిగాయని, ప్రభుత్వ సైట్లను లక్ష్యంగా చేసుకుని హ్యాకర్లు చెలరేగిపోతున్నాయని ఒక నివేదిక స్పష్టం చేసింది. క్విక్ హీల్ టెక్నాలజీస్ అనే సంస్థకు చెందిన సెక్రైట్ విభాగం 'తెలంగాణ సైబర్ థ్రెట్ రిపోర్ట్ 2025' పేరుతో రూపొందించిన ఈ నివేదిక ఆసక్తికర విషయాలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం.. గతేదాదిలో దేశంలో గుర్తించిన మాల్‌వేర్ దాడుల్లో 23%

తరువాయి 2లో



## హిందూమతాన్ని అవమానిస్తే ప్రజలు క్షమించరు

- లాలూపై మోదీ పరోక్ష విమర్శలు

భాగల్పుర్/భోపాల్: మహాకుంభ మేళాను, హిందూ మతాన్ని అవహేళన చేసిన ఆటవిక రాజ్య (జంగిల్‌రాజ్) నేతలను బిహార్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆర్జేడీ అధినేత, బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల లాలూ మాట్లాడుతూ.. కుంభమేళాను 'ఫాల్తూ' (అర్థరహితం)గా

తరువాయి 2లో



## గత ప్రభుత్వ దుర్మార్గపు పాలనలో..
# పతనం అంచుకు రాష్ట్రం



: సహజ వనరుల దోపిడీ, అలవిమాలిన అప్పులు, అధిక వడ్డీరేట్లు
- కేంద్ర నిధుల మళ్లింపు..
- బ్రాండ్ ఆంధ్రకు పూర్వవైభవం తెచ్చే పనిలో ఎన్డీయే ప్రభుత్వం
- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

అమరావతి : సహజ వనరుల దోపిడీ, ఇసుక తవ్వకాలు, ఎక్సైజ్‌లో లోపభూయిష్ట విధానాలతో గత ఐదేళ్ల (201924)లో రాష్ట్ర ఆదాయానికి గండిపడిందని, అప్పటి ప్రభుత్వ దుర్మార్గపు పాలన ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థిక పతనం అంచుకు చేర్చిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పన్నులను దారి మళ్లించడంతో 25 ఏళ్ల భవిష్యత్తు ఆదాయాన్ని కోల్పోయామని వివరించారు.

తరువాయి 2లో

## వైకాపాకు...
# ప్రతిపక్ష హోదా రాదు

- జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా వారికి దక్కేది
- ఓటింగ్ శాతం ప్రకారం హోదా కావాలంటే జర్మనీ వెళ్లమనండి
- ప్రజాతీర్పును గౌరవించి.. వైకాపా ఎమ్మెల్యేలు సభకు రావాలి
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్




గవర్నర్ ప్రసంగానికి వైకాపా నాయకులు అడ్డుతగలడం, ప్రసంగ ప్రతుల్ని చింపి నినాదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజలు 11 సీట్లే ఇచ్చారని వైకాపా

తరువాయి 2లో

# భారాసను కాపాడుతోంది భాజపానే

(మొదటి పేజీ తరువాయి)

చేసి జైల్లో వేస్తాం'' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మెదక్‌నిజామాబాద్ ఆదిలాబాద్‌కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లలో సోమవారం నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములాఈ కారు రేస్, గొర్రెల పంపిణీ పథకాలపై కేసులను అడ్డం పెట్టుకొని భాజపా బెదిరిస్తుండటంతోనే దిల్లీ వెళ్లి ఆ పార్టీ నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకున్నది నిజమో? కాదో? భారాస చెప్పాలన్నారు. కుంభకోణాలపై తాము కేసులు పెడితే మధ్యలో దూరి దస్త్రాలు తీసుకెళ్లిపోయిన ఈడీ... కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయలేకపోతోందో వెల్లడించాలన్నారు. "భారాస పదేళ్ల పాలనలో ప్రజాప్రతినిధులు పార్టీలు మారినప్పుడు రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయి? ఇప్పుడూ అవే కోర్టులు... అదే స్పీకర్ వ్యవస్థ ఉన్నాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస ఎందుకు పోటీ చేయడం లేదో? ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో పట్టభద్రులైన కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు ఏ పార్టీకి ఓట్లేస్తారో వెల్లడించాలి'' అని సీఎం స్పష్టంచేశారు.

*** నిధులెలా ఇవ్వరో చూద్దాం!**

"ఆర్ఆర్ఆర్, మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు అనుమతులు, నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శకునిలా అడ్డుపడుతున్నారు. 2014 19 సమయంలో ఎంపీగా పనిచేసిన నాకు... పలువురు కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో పరిచయాలున్నాయి. వారే నా చెవిలో ఈ విషయం చెప్పారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా, బీసీ నాయకుడిగా క్రమశిక్షణతో ఉన్న బండి సంజయ్ సీటును కిషన్‌రెడ్డి లాక్కున్నారు. బండారు దత్తాత్రేయ నియోజకవర్గమైన సికింద్రాబాద్ సీటునూ తీసుకున్నారు. అదే మా పార్టీలో పీసీసీ అధ్యక్షుడి స్థానాన్ని బీసీ బిడ్డ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కట్టబెట్టాం. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో ఒక రూపాయి వెళ్తే కేంద్రం... తెలంగాణకు 42 పైసలే తిరిగిస్తోంది. అదే బిహార్‌కు రూ.7.06, ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.3.50 ఎందుకిస్తోంది? మాపై కేంద్రానికి ఎందుకీ వివక్ష? అందుకే పట్టభద్రులను వేడుకుంటున్నా. భాజపా అభ్యర్థి గెలిస్తే మోదీ అమెరికాకు అధ్యక్షుడు కారు. అదే ఆ పార్టీని బండకేసి కొడితే... పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా వస్తుంది. మెట్రోకు నిధులొస్తాయి. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఓడిపోతే మా ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.

*** రాష్ట్రానికి కొత్త వైభవాన్ని తెస్తున్నాం...**

భారాస నిర్లక్ష్యంతో కుప్పకూలిన రాష్ట్రానికి అభివృద్ధిపరంగా కొత్త వైభవాన్ని తీసుకొస్తున్నాం. రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సన్నాలకు రూ.500 బోనస్ అమలు చేశాం. రూ.7,625 కోట్లు రైతుభరోసాగా అందించాం. 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు చేశాం. 25 వేల మందికి పదోన్నతులిచ్చాం. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు వేస్తున్నాం. 65 ఐటీఐలను ఏటీసీలుగా ఉన్నతీకరించాం. మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కు రాయితీ గ్యాస్ అందిస్తున్నాం. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు వచ్చేలా మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహిస్తున్నాం. నిఖత్ జరీన్, సిరాజ్, దీప్తిలకు ఉద్యోగాలతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందించాం. రాష్ట్రంలోని కొందరు ఇంజినీరింగ్ విద్యార్థులకు బయట మేస్త్రీలకుంటున్న అనుభవం లేకుండా పోయింది. ఇలా అన్నానని ఎవరూ బాధపడొద్దు. ఇలాంటి ఇక్కట్లు పడొద్దనే యంగ్ ఇండియా, స్పోర్ట్స్ యూనివర్సిటీలను 60 ఎకరాల్లో రూ.600 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఏర్పాటు చేస్తున్నాం. ఇవన్నీ నిజం కాదా...? కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని అనుకుంటే మా పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటేయండి. లేదని భావిస్తే ఎవరికైనా ఓట్లేసుకోండి'' అని రేవంత్ పిలుపునిచ్చారు.

*** వందేళ్ల సమస్యకు పరిష్కారం**

"దేశంలో పెద్ద బీసీ నరేంద్రమోదీ అని, చిన్న బీసీ బండి సంజయ్ అని ప్రకటించుకొనే భాజపా... బీసీ రిజర్వేషన్లను ఎందుకు చేయలేదు? మాలో నిజాయతీ ఉండటంతోనే వందేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కులగణన సమస్యను ఏడాదిలోనే పరిష్కరించాం. తెలంగాణలో 56.33% బీసీలున్నారని తేల్చాం. ముస్లింలను బీసీల్లో చేర్చడాన్ని బండి సంజయ్ తప్పుపడుతున్నారు. కరీంనగర్ కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు ఇలా మాట్లాడితే ఆయనకు తెలియదనుకోవచ్చు. కానీ, ఇప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్నారు. తన ఐఏఎస్ సెక్రటరీని అడిగి అవగాహనతో మాట్లాడాలి. ఇప్పటికే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. మేం ఎవరి సంఖ్యనూ పెంచలేదు... తగ్గించలేదు. ఉన్న లెక్కల్ని తేల్చాం. మోదీ సర్కారు జన, కులగణనలు చేపట్టి మా లెక్కలను తప్పని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా. దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం 50% రిజర్వేషన్ పరిమితిని ఎత్తేయాలి. ప్రధాని మోదీ మందకృష్ణను ఆలింగనం చేసుకున్నాడే తప్ప.. ఎస్సీ వర్గీకరణ చేయలేదు. మందకృష్ణ మనోడే. కానీ, వర్గీకరణ అంశాన్ని జటిలం చేసిన భాజపా కావాలో, చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరిస్తున్న మేం కావాలో ఆలోచన చేయాలి'' అని సీఎం కోరారు.

# అభివృద్ధిలో కలిసిరండి

(మొదటి పేజీ తరువాయి)

సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చే పరిశ్రమల అభివృద్ధి, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలకు తమ ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టంచేశారు. అమెరికాలోనే అతిపెద్ద బయోటెక్నాలజీ కంపెనీ 'అమ్‌జెన్' హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'న్యూ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సైట్'ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్‌ను గ్లోబల్ క్యాపిటల్‌గా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. హెల్త్‌కేర్ రంగంలోనూ నంబర్ వన్‌గా నిలిపేందుకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం కృషిచేస్తోంది. అద్భుత ఆవిష్కరణలకు కేంద్రంగా మారిన హైదరాబాద్ బ్రాండ్‌ను మరింత పెంచుతాం. అమ్‌జెన్ వంటి ప్రపంచ అగ్రగామి సంస్థలు రాష్ట్రానికి రావడం కొత్త అవకాశాలను తెస్తుంది. అమ్‌జెన్ కొత్త క్యాంపస్‌లో ఈ ఏడాది చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 600, రాబోయే రోజుల్లో 2 వేలకు చేరుతుంది. తెలంగాణలోని విశ్వవిద్యాలయాలు, స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలతో అమ్‌జెన్ కలిసి పని చేయాలి'' అని కోరారు. అమ్‌జెన్ ఛైర్మన్, సీఈఓ రాబర్ట్ ఎ.బ్రాడ్‌వే మాట్లాడుతూ.. "1980లో స్థాపించిన మా సంస్థ క్లిష్టమైన వ్యాధులకు వినూత్నమైన ఔషధాలను తయారు చేస్తోంది. 100 దేశాల్లో 28 వేల మంది ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారు. క్యాన్సర్, గుండె జబ్బులు, ఎముకలు పెళుసుబారడం, ఇన్‌ఫ్లమేటరీ, అరుదైన వ్యాధుల చికిత్సల్లో ఇప్పటికే ఉన్న ఔషధాలతో పాటు విస్తృతమైన, లోతైన పరిజ్ఞానంతో ఉత్పత్తులను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ఏడాది చివరి నాటికి 200 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1600 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నాం'' అని పేర్కొన్నారు. అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, అమ్‌జెన్ ఇండియా ప్రతినిధి సోమ్‌ఛటోపాధ్యాయ, సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుల్లపల్లి, మానవ వనరుల విభాగం వైస్ ప్రెసిడెంట్ డెరెక్ మిల్లర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈఓ నాగప్పన్ పాల్గొన్నారు.

# హిందూమతాన్ని అవమానిస్తే ప్రజలు క్షమించరు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొనడం వివాదానికి దారితీసింది. లాలూ పేరు ప్రస్తావించకుండా ఆయనను ఆటవికంగా రాజ్యపాలన చేసిన నాయకునిగా అభివర్ణించారు. "మహా కుంభమేళా ఒక గొప్ప దేశ సమైక్యతా ఉత్సవం. ఐరోపా ఖండం జనాభా మొత్తం కన్నా ఎక్కువ మంది ఈ మేళాలో పవిత్ర స్నానమాచరించారు,'' అని ఆయన అన్నారు. "ఆటవిక రాజ్యం నడిపిన వారు మహా కుంభమేళాపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. వీళ్లు అయోధ్యలో రామాలయాన్ని కూడా వ్యతిరేకించారు. బిహార్ ప్రజలు వీళ్లను క్షమించబోరని నాకు తెలుసు,'' అని ప్రధాని అన్నారు. భాగల్పూర్‌లో సోమవారం.. పీఎం కిసాన్ పథకం కింద 19వ విడత నిధుల్ని రైతుల ఖాతాలకు బదిలీ చేసిన అనంతరం జరిగిన సభలో మోదీ ప్రసంగించారు.

*** ఆర్థికాభివృద్ధిలో దేశం ముందంజ**

ప్రతిభావంతుల సంగమం, పారిశ్రామికాభివృద్ధికి కేంద్రమైన మధ్యప్రదేశ్ వాణిజ్యానికి గమ్యస్థానంగా మారుతోందని నరేంద్రమోదీ అన్నారు. అంతకుముందు భోపాల్‌లో ఆయన 'ఇన్వెస్ట్ మధ్యప్రదేశ్, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2025''ను ప్రారంభించి ప్రసంగించారు.

*** క్షమించండి.. అందుకే ఆలస్యంగా వచ్చా**

ఈ సభకు మోదీ 15 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నారు. అందుకు కారణాన్ని వివరిస్తూ "10, 12 తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్ష ప్రారంభమయ్యే సమయం.. నేను రాజ్‌భవన్ నుంచి బయల్దేరే సమయం ఒకటే. అప్పుడు నేను వస్తే భద్రతా కారణాల దృష్ట్యా ట్రాఫిక్ జామ్ కావొచ్చు. దాంతో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉంది. అందుకే వారంతా పరీక్షా కేంద్రాలకు వెళ్లిన తర్వాత రాజ్‌భవన్ నుంచి బయల్దేరాలనుకున్నాను. దాంతో 1520 నిమిషాలు ఆలస్యమైంది. ఇక్కడ మీకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణ కోరుతున్నాను'' అని మోదీ అన్నారు.

# పందులు.. రాబందులు..

*** కుంభమేళా విమర్శకులపై యూపీ సీఎం ఆదిత్యనాథ్ ధ్వజం**

దిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా నిర్వహణ లోపాలపై విమర్శలు గుప్పించిన ప్రతిపక్ష నేతలను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పందులు, రాబందులతో పోల్చారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ "మహాకుంభ్‌లో ఎవరు ఏది కోరుకుంటే అది లభించింది. రాబందులకు మృతదేహాలు దొరికాయి, పందులకు అపరిశుభ్రత కనిపించింది. సున్నిత స్వభావులకు సుందరమైన సంబంధ బాంధవ్యాలు, వ్యాపారులకు వ్యాపారం, భక్తులకు పరిశుభ్రమైన ఏర్పాట్లు లభించాయి,'' అని ఆయన అన్నారు. మహా కుంభమేళా తొక్కిసలాటలో 18 మంది మరణించడంపై ప్రతిపక్షం తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఒక కులానికి చెందిన వారిని అక్కడికి వెళ్లకుండా నిరోధించామని మీరు (ప్రతిపక్ష



సభ్యులు) అన్నారు. ఏ కులాన్నీ ఆపలేదు. సరైన ఉద్దేశాలతో మహాకుంభ్‌కు వెళ్లేవారు అక్కడికి గౌరవంగా వెళ్లాలి. దురుద్దేశాలతో వెళ్లి అరాచకం సృష్టించాలని అనుకునేవాళ్లు అందుకు తగ్గ ప్రతిఫలాన్ని అనుభవిస్తారు,'' అని ఆదిత్యనాథ్ తెలిపారు. "మీలా మేం మతంతో ఆటలాడలేదు. మీ హయాంలో కుంభమేళా ఏర్పాట్లు సమీక్షించేందుకు ముఖ్యమంత్రికి సమయమే లేకపోయింది. సనాతనులు కానివారిని కుంభమేళా వ్యవహారాలకు ఇన్‌చార్జిగా నియమించారు,'' అని ఆయన సమాజ్‌వాదీపార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి అన్నారు. "మా విషయానికి వస్తే... నేనే స్వయంగా కుంభ్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నాను. 2013లో కుంభమేళాకు వచ్చిన ప్రతి ఒక్కరూ అరాచకం, అవినీతి, కాలుష్యాలనే చూశారు. ఆనాడు త్రివేణి సంగమంలో స్నానం చేయడానికి తగిన నీళ్లు లేనే లేవు. మారిషస్ ప్రధాని ఆనాడు త్రివేణి సంగమంలో స్నానం చేసేందుకు నిరాకరించారు కూడా'' అని ఆదిత్యనాథ్ గుర్తు చేశారు. 27 వరకూ కాశీలో వీఐపీ దర్శనాల్లేవ్ వారణాసి: మహాశివరాత్రి నేపథ్యంలో భక్తులు భారీగా తరలివస్తారనే అంచనాల నేపథ్యంలో ఈ నెల 25 నుంచి 27 వరకూ కాశీలోని విశ్వనాథుని ఆలయంలో వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. వారణాసి సమీపంలోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహాకుంభమేళాకు వచ్చే భక్తుల్లో అత్యధికులు కాశీకి వస్తుండటంతో ఇప్పటికే ఇక్కడ తీవ్రమైన రద్దీ ఉంటోంది. ఈసారి మహాకుంభమేళ కొనసాగుతున్న సమయంలోనే ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం రావడంతో భక్తుల రాక విపరీతంగా ఉంటుందని భావిస్తున్నారు.



## గోల్కొండ 6.. చార్మినార్ 9

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా 202324 సంవత్సరంలో గోల్కొండ, చార్మినార్ రెండూ కలిపి 28 లక్షల మందికిపైగా దేశీయ పర్యాటకులను ఆకర్షించాయి. ఇందులో గోల్కొండ కోటకు 202223లో 15.27 లక్షల మంది రాగా... 2023 24లో 16.08 లక్షల మంది వచ్చారు. ఇక చార్మినార్‌ను 202223లో 9.29 లక్షల మంది చూడగా... ఇక్కడికి 202324లో ఏకంగా 12.90 లక్షల మంది సందర్శకులు రావడం విశేషం. గోల్కొండను మునుపటి ఏడాది కంటే 2023 24లో 80 వేల మంది ఎక్కువగా సందర్శిస్తే... చార్మినార్‌ని 3.60 లక్షల మంది ఎక్కువగా సందర్శించడం గమనార్హం.

## తెలంగాణలో పెరిగిన ర్యాన్సమ్‌వేర్ దాడులు, డిజిటల్ మోసాలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పరిధిలో చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో రోజుకు 47 ర్యాన్‌సమ్‌వేర్ దాడులు జరిగాయి. గతేడాది మొత్తం 17,505 సైబర్ దాడి ఘటనలు నమోదయ్యాయి. బాధిత సైట్లలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సైట్ కూడా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ అయిన డేటా.తెలంగాణ.గవ్.ఇన్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వెబ్‌సైట్ ఉన్నాయి.

**డిజిటల్ మోసాలూ అధికమే**

రాష్ట్రంలో జరుగుతున్న సైబర్ దాడుల్లో గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్) ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో గతేడాదిలో ఇటువంటి 30,000 ఉదంతాలు నమోదయ్యాయి. 11,125 అనధికార లావాదేవీలు, 5,369 కేవైసీ నవీకరణ మోసాలు వెలుగుచూశాయి. కొరియర్ పేరుతో మోసాలు, పోలీసుల పేరు చెప్పి వంచించడం, డిజిటల్ అరెస్టు మోసాలు, సంబంధిత ఇతర ఉదంతాలు 18,000 కంటే అధికంగా ఉన్నాయి. వ్యాపారం, పెట్టుబడి, ప్రకటనల మోసాలు, అప్పుల పేరుతో డిజిటల్ మోసాల కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఎంతో మంది ఇబ్బంది పడ్డారు. ఒక కార్పొరేట్ ఆసుపత్రి గ్రూపుపై జరిగిన ర్యాన్‌సమ్‌వేర్ దాడి వల్ల ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డులు (ఈఎంఆర్), బిల్లులు తారుమారయ్యాయి. దీనివల్ల రోగులకు అందించే సేవల్లో సమస్యలు ఎదురయ్యాయి. ఒక వైద్య కళాశాల ఆర్థిక లావాదేవీలు, విద్యార్థుల రికార్డులు, అధ్యాపకుల జీతభత్యాలు చెల్లింపుల్లో గందరగోళం ఏర్పడింది. ఉపముఖ్యమంత్రి సైట్‌ను, కొన్ని ఇతర ప్రభుత్వ వెబ్‌సైట్లపై సైబర్ నేరగాళ్లు దాడులు చేశారు. ఉపముఖ్యమంత్రి సైట్‌పై దాడి చేయడం వల్ల కొన్ని పత్రాలు చూడటానికి, సమాచారాన్ని సంగ్రహించడానికి అవకాశం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ప్రధాన ఐటీ కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో.. సైబర్ సవాళ్లూ పెరుగుతున్నాయని క్విక్ హీల్ టెక్నాలజీస్ సీఈఓ విశాల్ సాల్వి వివరించారు. రాష్ట్రంలో సైబర్ భద్రతను ఎంతో ముఖ్యమైన అంశంగా పరిగణించాలని సూచించారు. డేటా ప్రైవసీ, సైబర్ థ్రెట్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

## గత ప్రభుత్వ దుర్మార్గపు పాలనలో.. పతనం అంచుకు రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్డీయే అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే బ్రాండ్ ఆంధ్రకు పూర్వవైభవాన్ని పునరుద్ధరించే పని ప్రారంభించామని తెలిపారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. 'నిర్మాణం కీలక దశలో ఉన్న సమయంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సలహాలను బేఖాతరు చేస్తూ, గత ప్రభుత్వం ఏజెన్సీని రద్దు చేసి డయాఫ్రమ్ వాల్ కూలిపోవడానికి కారణమైంది. నీటిపారుదల ఇంధన రంగాలు విధ్వంసానికి గురయ్యాయి. ఎక్కువ వడ్డీ రేట్లకు అధిక రుణాలు తెచ్చారు. కేంద్ర మార్గదర్శకాలను ఉల్లంఘించార'ని పేర్కొన్నారు. 'ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి ప్రజలు సంపూర్ణ మద్దతు అందించారు. గత ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా శాసనసభ ఎన్నికల్లో అపూర్వ తీర్పునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశాం. సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేలకు పెంచి ఏడాదికి రూ.33,312 కోట్లు వ్యయం చేస్తున్నాం. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించాం. 204 అన్న క్యాంటీన్లను పునరుద్ధరించాం. భూఆక్రమణల నిరోధక చట్టం తెచ్చాం. గ్రామీణ మౌలిక సదుపాయాలనుమెరుగుపరిచాం' అని వివరించారు. గవర్నర్ ప్రసంగంలోని కీలకాంశాలు..

## వైకాపాకు ప్రతిపక్ష హోదా రాదు

(మొదటి పేజీ తరువాయి)

వారు గుర్తుంచుకోవాలని, వారి తీర్పును గౌరవించి సభకు వచ్చి ప్రజాసమస్యల్ని ప్రస్తావించాలని సూచించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సోమవారం పవన్‌కల్యాణ్ విలేకర్లతో మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదా అడిగితే వచ్చేది కాదు. ప్రజలు ఇవ్వాలి. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ వచ్చిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. తర్వాత మెజారిటీ వచ్చిన పార్టీకి ప్రతిపక్ష హోదా ఇస్తారు. గతంలో మేం ప్రభుత్వం ఏర్పాటు చేశాం కదా.. ఇప్పుడు హోదా ఇవ్వండి అంటే కుదరదు. ఇది చంద్రబాబో, పవన్‌కల్యాణో నిర్ణయించేది కాదు. రాజ్యాంగం, నియమ నిబంధనలు ఉన్నాయి. అసెంబ్లీలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన. మాకంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా వైకాపాకు ప్రతిపక్ష హోదా దక్కేది' అని పవన్ పేర్కొన్నారు. 'గవర్నర్‌ను ఆహ్వానించడానికి రావాలని స్పీకర్ నన్ను తీసుకెళుతుంటే.. ఉపముఖ్యమంత్రికి ప్రొటోకాల్ ఉండదని చెప్పి, లోపలికి వెళ్లిపోయాను. ఎందుకంటే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకూడదు. ఎన్డీయే పక్ష నాయకుడిని ఎన్నుకునేటప్పుడు నాయకుల మధ్యలో కూర్చొన్నాను. అదే ఇక్కడ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు నన్ను ప్రధానమంత్రి పక్కన కూర్చోబెట్టలేదు. డిప్యూటీ సీఎం అయినా మంత్రి హోదానే కాబట్టి మంత్రుల పక్కనే కూర్చొన్నా. ఇది స్పష్టమైన నిబంధన' అని పవన్ తెలిపారు. అలాగే 11 సీట్లు వచ్చిన పార్టీకి నిబంధనల ప్రకారం ఎంత సమయం ఇవ్వాలో స్పీకర్ నిర్ణయిస్తారని, అప్పుడు ప్రజాసమస్యల గురించి ప్రస్తావించాలని సూచించారు. ఇది వైకాపా వారిని అవమానపరచడానికో, తగ్గించడానికో చెబుతుంది కాదని స్పష్టం చేశారు.

## మల్లన్నకు వైభవంగా పుష్పపల్లకి సేవ

(మొదటి పేజీ తరువాయి)

మండపం నుంచి నంది మండపం వరకు ఆది దంపతుల గ్రామోత్సవం నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం దేవస్థానం అధికారులు చేసిన ఏర్పాట్లను దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు.

# తెలంగాణకు టోపీ.. ఆంధ్రాకు లాఠీ

- కృష్ణా బోర్డును ప్రశ్నించలేని దుస్థితిలో జిల్లా మంత్రులు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కృష్ణ జలాల వాటా విషయంలో కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి టోపీ పెట్టి.. ఆంధ్ర పాలకులకు పెత్తనమిచ్చి.. వారి చేతిలో లాఠీ పెట్టిందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి రోడ్డులోని పి బి గార్డెన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. సాధించుకున్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల మన్ననలను పొందాయని గుర్తు చేశారు. ప్రజల అవసరాల దృష్టిలో పెట్టుకొని, కెసిఆర్ ప్రజలు కోరినవే కాకుండా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారన్నారు. ప్రజా పాలన అని చెప్పుకుంటూ అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రాక్షస పాలన, రైతు వ్యతిరేక పాలన సాగిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పార్టీ అని చెప్పుకొని ఇప్పుడు రైతుని బజారు పాలు చేస్తుందని దుయ్యబట్టారు. కెసిఆర్ హయాంలో కృష్ణ బేసిన్ నుంచి తెలంగాణ వాటాను ఖచ్చితంగా తీసుకున్నామని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక కృష్ణ బేసిన్ నుంచి తెలంగాణ రాష్ట్ర వాటాను ఇవ్వడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా కృష్ణ బేసిన్ నుంచి అదనంగా నీటిని ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తున్నా పట్టించుకోని చేతకాని ప్రభుత్వమని అసహనం వ్యక్తం చేశారు. జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నా కృష్ణా బోర్డు ను ప్రశ్నించలేని దుస్థితిలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శిష్యుడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఆంధ్ర తొత్తులుగా పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వానికి 12మంది సలహాదారులు ఉండగా, అందులో 8మందిని ఆంధ్ర పాలకుల తొత్తులను నియమించుకోవడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా కనబడుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ టు ఢిల్లీ ప్రయాణం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని ఆరోపించారు. ప్రస్తుత మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన రాజీనామా ద్వారా వచ్చిన ఎన్నికల ద్వారానే మునుగోడు అభివృద్ధి చెందింది అనడం ఒట్టి అబద్ధమని ఆరోపించారు. ఆ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన నిధులేనని గుర్తుంచుకోవాలన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసం ఉరుకులాట తప్ప మునుగోడు ప్రజలకు సంవత్సరకాలంలో చేసింది ఏమీ లేదని ఆరోపించారు. మంత్రి పదవి రాకపోతే కంత్రి గా మారుతాడని ఆరోపించారు. గత 10సంవత్సరాలుగా ఇంటింటికి నీటిని సరఫరా చేశామనో, ఇప్పుడు నీళ్లు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన, ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్, మండల ప్రధాన కార్యదర్శి అల్మాస్ పేట కిష్టయ్య, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ తాడూరి శిరీష పరమేష్, టిఆర్ఎస్ యువజన విభాగం మున్సిపల్ అధ్యక్షుడు తొర్పునూరి నరసింహ గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన వెంకటేష్ యాదవ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఊడుగు మల్లేశం గౌడ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, చిన్నం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పీ రెహమాన్ సూచనలతో సోమవారం నుండి కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగానే సోమవారం లైసెన్సులు లేకుండా ఆటోలను నడుపుతున్న రామవరం, సూపర్ బజార్,లక్ష్మీదేవిపల్లి,సుజాతనగర్ అడ్డా లకు చెందిన 05 మంది డ్రైవర్లకు జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో లెర్నింగ్ లైసెన్స్ లను ఇప్పించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ.నరేష్ తెలియజేశారు.డ్రైవింగ్ లైసెన్సులు పొందడానికి అర్హతలు కలిగి ఉండి లైసెన్సులు తీసుకోకుండా వాహనాలు నడిపే వారిపై ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.

## పురుగుల మందు సేవించి వృద్ధుడు ఆత్మహత్య



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అప్పులు ఎక్కువయ్యి, ఎలా తీర్చాలని మనస్థాపంతో జీవితంపై విరక్తి చెంది ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన జెల్ల దేవయ్య (53) అనే వ్యక్తి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. గత 4 సంవత్సరాల క్రితం దేవయ్య తన కూతురు పెండ్లి చేశాడని, పెండ్లికి, ఇతర ఇంటి అవసరాలకు తెలిసిన వారి వద్ద సుమారు 8లక్షల వరకు అప్పులు చేశాడని, దీంతో అప్పులు ఎక్కువయ్యి, ఎలా తీర్చాలని మనస్థాపంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకన్నాడని తెలిపారు. ఈ మేరకు మృతుని భార్య జెల్ల పద్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు.

## బీఆర్ఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. చిన్న కొండూరు బీఆర్ఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన గ్రామ శాఖ అధ్యక్షునిగా చీమకండ్ల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా తీగుళ్ల బాలరాజు, ఉపాధ్యక్షులుగా చింతపల్లి వెంకట్ రెడ్డి, మేకల శ్రీశైలం, దోర్నాల నరేష్, కోశాధికారిగా బక్క స్వామి, సహాయ కార్యదర్శులుగా చెక్క యాదయ్య, గడగోటి చంద్రయ్య, ఆర్గనైజర్ సెక్రటరీగా గరిశె సాయికిరణ్, కార్యవర్గ సభ్యులుగా చెక్క ఎల్లయ్య, గరిశె వెంకటేశం, పగిళ్ల లచ్చిరెడ్డి, నానుచర్ల శ్రీనివాస్, కానుకుర్తి ప్రసాద్ బాబు, చెక్క శ్రీకాంత్, గరిశె మహంకాళి, చింతల వెంకటేష్, ఉప్పునూతల మహేందర్, గడగోటి నరసింహాలు ఎన్నికయ్యారు. నూతన కమిటీని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అల్మాస్ పేట కిష్టయ్య, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, చిన్నం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ సీనియర్ నేత మజ్జి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మజ్జి శ్రీనివాస్ (మెట్ల శ్రీనివాస్)జన్మదిన వేడుకలు సోమవారం జగద్గిరిగుట్టలోని ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు,సన్నిహితుల మధ్య ఆయన కేక్ కట్ చేయించారు. అనంతరం పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లను నివాస కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు మజ్జి శ్రీను ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**: పి డి ఎస్ యు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా విద్యా పూర్తిగా వ్యాపారమయమై గల్లి గల్లికి మోడల్ స్కూల్స్,ఈ టెక్నో , ఫౌండేషన్ ,ఈటెక్నో, డిజీ, మెడిసిన్,ఐఐటి ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యదేచ్ఛగా లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పి డి యస్ యూ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ నరేందర్ అన్నారు. పి డి యస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే పాఠశాల పేరుతో సబ్ క్యాంపస్ లను కనీస వసతులు లేకుండానే పాఠశాలలను ప్రారంభిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయ అర్హత లు లేకుండానే టీచర్లుగా నియమించుకుంటున్నారని రేకుల షెడ్ల నుండి మొదలుకొని, అప్ స్టేర్ బిల్డింగ్ లలో తరగతి గదులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ రెండు విద్యా నియమాలకు విరుద్ధమైనవి. విద్యార్థులకు ప్రమాదకరమైనవి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్రాగడానికి నీరు, వాష్ రూమ్స్, తరగతి గదులలో ఫ్యాన్లు, వెలుతురు లేకుండానే చీకటి గదుల్లో వేలాది మంది విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల పట్ల నిర్లక్ష్యాన్ని వహిస్తూ నాసీ రకమైన విద్యని అందిస్తూ వేలల్లో , లక్షల్లో ఫీజులను విపరీతంగా దండుకుంటున్నారు. మరోపక్క విద్యా సంవత్సరం ముగించక ముందే పాఠశాలు, ఇంటర్మీడియట్ కళాశాలలు చట్ట విరుద్ధంగా కరపత్రాలు,బ్యానర్లు,యాడ్స్ తో ప్రచారం చేస్తూ టీచర్స్ ని, కొంతమంది పిఆర్ ఓ లను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్ క్యాంపియన్ చేయాలంటూ పంపిస్తున్నారు. దీనిని పి డి యస్ యూ విద్యార్థి సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తక్షణమే విద్యాశాఖ అధికారులు,పేరెంట్స్ ప్రమేయంతో ఫీజులు నిర్దేశించాలని, ప్రతి ప్రైవేట్ ,కార్పొరేట్ పాటశాలల్లో పేరెంట్స్ కమిటీ లు నియమించాలని, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న పాఠశాల, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన అభినందనీయం



హనుమకొండ, ప్రజాస్ఫూర్తి: ప్రతి వస్తువు కల్తీమయం అవుతున్న ఈ రోజుల్లో సేంద్రియ, గోఆధారిత ఎరువులతో పండించిన ఉత్పత్తులను ప్రదర్శించడం అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని రాజరాజ నరేంద్ర భాషా నిలయంలో గ్రామ భారతి ప్రకృతి జీవన వికాస వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శ నను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నగర ప్రముఖులు తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు రామారావు, అనిత, సారయ్య,సిహెచ్ భారతీ దేవి ,రవీందర్, రామ్,రామేశ్వరం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : పేదరికం నుండి వచ్చి తమతో కలిసి పోలీస్ ఉద్యోగం సాధించి,2011 లో కాకినాడ నందు ఒకేదగ్గర అందరూ ట్రైనింగ్ పూర్తిచేసి యూసుఫ్ గూడా నందు 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజు గత సంవత్సన్ డిసెంబర్ 28న మృతి చెందారన్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న వారి సహచర ఉద్యోగులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

## కొత్తగూడెంలో ఆరోగ్య మహాసభలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రకృతి ఆరోగ్య మహాసభలను నిర్వహించాలని ప్రకృతి ఆశ్రమం కమిటీ సభ్యులు నిర్ణయించారు. వచ్చే నెల మార్చి 23వ తేదీన, ఆరోగ్య మహాసభలను ఘనంగా నిర్వహించాలని, సోమవారం సాయంత్రం ఎస్సిబి నగర్ లోనే, స్వర్ణ భారతి పాఠశాల లో సమావేశమైన కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఆశ్రమం కో ఆర్డినేటర్ సుగుణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో, గౌరవ అధ్యక్షులు మొక్కల వెంకటయ్య, గౌరవ సలహాదారు సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్ లు మాట్లాడుతూ.. ఆశ్రమం ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా యోగ మహాసభలు, మిల్లెట్స్ ఫెస్టివల్, మిల్లెట్స్ తో వంద రకాల వంటకాలు, ఔషధ మొక్కల ప్రదర్శన, కరోనా పై అవగాహన సదస్సు, డాక్టర్స్ మీట్, యోగ ప్రకృతి వైద్యం తదితర అంశాల పై సభలను ప్రతి సంవత్సరం విజయవంతంగా జరుపుకుంటూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఆశ్రమం నిర్వాహకులు ప్రముఖ ప్రకృతి కవి, సామాజికవేత్త జయరాజు నేతృత్వంలో జరుగనున్న ఈ సభలలో ఆయా రంగాలలో నిష్ణాతులైన ప్రముఖ వైద్యులు, సామాజికవేత్తలు, మానసిక వైద్యులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, యోగా గురువులు, ప్రకృతి తత్వవేత్తలు పాల్గొని శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం, పర్యావరణ ఆరోగ్యం లపై ప్రసంగించనున్నారని వెల్లడించారు. ఆరోగ్యరక్షణ పై అభిలాష కలిగిన, ఆరోగ్య అభిమానులు, ప్రకృతి ప్రేమికులందరూ ఈ సభలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాల్గొన్న వారిలో ప్రభుత్వ ఐటిఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాయలింగు, స్వర్ణ భారతి పాఠశాల కరస్పాండెంట్ శైలజ, పిల్లలమర్రి వరప్రసాద్, బిక్కు లాల్, దయాసాగర్, బంగారి శంకర్, కే. రమేష్ బాబు, సబ్బన రాజేష్, యాకస్వామి లు పాల్గొన్నారు.

## అపోలో డెంటల్ ని ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, కాప్రా : హిల్ టాప్ కాలనీ సైనిక్ పూరి లో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డెంటల్ ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నల్ల రాధ కృష్ణ , డా. రాహుల్ రెడ్డి, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

# కీసరగుట్ట బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన రాచకొండ సీపీ

* **బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అధికారులు , సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**
* **సీపీ సుధీర్ బాబు,**

ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సావాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు , భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్ల గురించి రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు బందోబస్తు విధుల్లో ఉన్న సివిల్, ట్రాఫిక్ మరియు ఇతర విభాగాల అధికారులు , సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సావాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల భద్రతా పరమైన పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బందోబస్తు





విధుల్లో ఉన్న అధికారులు మరియు సిబ్బంది తమకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యబృందం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల సౌకర్యార్థం డాక్టర్ల బృందంతో పాటు అంబులెన్సును, బీపీ షుగర్ వంటి వాటితో పాటు ఇతర అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులతో పాటు బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది యొక్క క్షేమం కూడా తమకు అంతే ముఖ్యమని, పోలీసు సిబ్బంది అనుకోని పరిస్థితుల్లో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, అంతేకాకుండా ప్రత్యేక వైద్య చికిత్స తీసుకుంటున్న సిబ్బందికి అవసరమయ్యే మందులు కూడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరుతో పాటు వేసవి తాపానికి కొందరు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది కాబట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుధ్య ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, మహిళల కోసం ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో అన్ని వైపులా ఏర్పాటు చేసిన సిసిటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీం బృందాలు కూడా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. భారీసంఖ్యలో భక్తులు దైవదర్శనం కోసం వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి డిసిపి పివి పద్మజ, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, ఐటి సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆదిత్య మెడికల్ అకాడమీ ప్రారంభించిన బండారి లక్ష్మారెడ్డి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఈసిఐఎల్ లోనూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య మెడికల్ అకాడమీ నీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.మంచిగా కోచింగ్ ఇచ్చి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఆయన అన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు మీర్పేట్ కార్పొరేటర్ ప్రభుదాస్ , భాను గౌడ్ హేమా ,రాబిన్సన్ మహేష్ గౌడ్, నవీన్ గౌడ్ ,జంపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియల తో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో (64) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు., అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## శ్రీ వెంకట శివరామలయ ప్రాంగణంలో మొక్కలు నాటుట కార్యక్రమం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 17వ డివిజన్ లో గల శ్రీ వెంకట శివరామలయ దేవాలయ ప్రాంగణంలో సోమవారం ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానం

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జగద్గిరి గుట్ట కొండపై వెలసిన మల్లికార్జున స్వామి భ్రమరాంబ, కేతమ్మ 39వ కళ్యాణ మహోత్సవానికి రావలసిందిగా కోరు తు శనివారం అఖిల భారత యాదవ సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలోఅఖిల భారత యాదవ సభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీందర్ యాదవ్ ని , విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ని కలిసి వారికి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సమ్మయ్య యాదవ్ , సత్యనారాయణ యాదవ్, కుమార్ యాదవ్, రాజు యాదవ్, సింహ యాదవ్ శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు మంచి కోర్సులను ఎంచుకొని మంచి భవిష్యత్తులు ఏర్పాటు చేసుకునేలా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. సోమవారం కూకట్ పల్లి మండలంలోని ఎల్లమ్మబండ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టరు తనిఖీ చేసారు. ఈ సందర్భగా కలెక్టరు మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి తరువాత ఏ కోర్సు తీసుకోవాలి అనే అంశం పై వారికి క్షుణ్ణంగా అర్థమయ్యేలా దిశ నిర్దేశం చేయాలని అన్ని పాఠశాలలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు సూచించారు. కలెక్టరు తెలిపారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తులో ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని



మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం విద్యార్థులకు తెలిపారు. పదవ తరగతిలోని ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు విద్యకై అవసరమైన సలహాలను కలెక్టరు విద్యార్థులకు వివరించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. సిలబస్ పూర్తైందా అని, రివిజన్ ఎలా జరుగుతుందని, స్కూల్లో వసతులు ఏలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రాష్ట్ర విద్యాశాఖ ద్వారా అందజేసే FLN ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ ద్వారా, పాఠశాలలో భాషా గణిత సామర్థ్యాలలో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేకమైన టూల్ ద్వారా విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ల్యాబును కలెక్టరు ప్రారంభించారు. ప్రతి విద్యార్థి 20 నిమిషాల నిడివితో పాఠలు వినాలని తప్పనిసరిగా నాలుగురోజులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్యాంప్రకాష్, తహాసీల్దారు స్వామి, డిఈఓ విజయ కుమారి, పాఠశాల హెడ్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలు

* **బల్క్ ఎస్ఎంఎస్ లు పంపడం నిషేధం.**
* **ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి**
* **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

. **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 27న జరిగే నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్ )అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నేడొక ప్రకటన లో తెలిపారు. సైలెన్స్ పీరియడ్ లో భాగంగా 25 వి తేదీ సాయంత్రం 4.00 గంటల నుండి 27వ తేదీ సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం




చేయడం, ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సైలెన్స్ పిరియడ్ లో ఎవరు కూడా రాజకీయపరమైన ఎస్.ఎం.ఎస్ లు, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపకూడదని, బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించకూడదని, ప్రచారం చేయరాదని కలెక్టర్ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సైలెన్స్ పీరియడ్ లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు,ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టి, ఎంసీసీ, టీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికలు నిర్వహించే ఆయా జిల్లాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ అట్టి ప్రకటన లో వెల్లడించారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**: పి డి ఎస్ యు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా విద్యా పూర్తిగా వ్యాపారమయమై గల్లి గల్లికి మోడల్ స్కూల్స్,ఈ టెక్నో, ఫౌండేషన్ ,ఈటెక్నో, డిజీ, మెడిసిన్,ఐఐటి ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యదేచ్ఛగా లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పి డి యస్ యూ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ నరేందర్ అన్నారు.పి డి యస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే పాఠశాల పేరుతో సబ్ క్యాంపస్ లను కనీస వసతులు లేకుండానే పాఠశాలలను ప్రారంభిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయ అర్హత లు లేకుండానే టీచర్లుగా నియమించుకుంటున్నారని రేకుల షెడ్ల నుండి మొదలుకొని, అప్ స్టేర్ బిల్డింగ్ లలో తరగతి గదులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ రెండు విద్యా నియమాలకు విరుద్ధమైనవి. విద్యార్థులకు ప్రమాదకరమైనవి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్రాగడానికి నీరు, వాష్ రూమ్స్, తరగతి గదులలో ఫ్యాన్లు, వెలుతురు లేకుండానే చీకటి గదుల్లో వేలాది మంది విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల పట్ల నిర్లక్ష్యాన్ని వహిస్తూ నాసీ రకమైన విద్యని అందిస్తూ వేలల్లో , లక్షల్లో ఫీజులను విపరీతంగా దండుకుంటున్నారు. మరోపక్క విద్యా సంవత్సరం ముగించక ముందే పాఠశాలు, ఇంటర్మీడియట్ కళాశాలలు చట్ట విరుద్ధంగా కరపత్రాలు,బ్యానర్లు,యాడ్స్ తో ప్రచారం చేస్తూ టీచర్స్ ని, కొంతమంది పిఆర్ ఓ లను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్ క్యాంపియన్ చేయాలంటూ పంపిస్తున్నారు. దీనిని పి డి యస్ యూ విద్యార్థి సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తక్షణమే విద్యాశాఖ అధికారులు,పేరెంట్స్ ప్రమేయంతో ఫీజులు నిర్దేశించాలని, ప్రతి ప్రైవేట్ ,కార్పొరేట్ పాటశాలల్లో పేరెంట్స్ కమిటీ లు నియమించాలని, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న పాఠశాల, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : పి డి ఎస్ యు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా విద్యా పూర్తిగా వ్యాపారమయమై గల్లి గల్లికి మోడల్ స్కూల్స్,ఈ టెక్నో, ఫౌండేషన్ ,ఈటెక్నో, డిజీ, మెడిసిన్,ఐఐటి ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యదేచ్ఛగా లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పి డి యస్ యూ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ నరేందర్ అన్నారు.పి డి యస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే పాఠశాల పేరుతో సబ్ క్యాంపస్ లను కనీస వసతులు లేకుండానే పాఠశాలలను ప్రారంభిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయ అర్హత లు లేకుండానే టీచర్లుగా నియమించుకుంటున్నారని రేకుల షెడ్ల నుండి మొదలుకొని, అప్ స్టేర్ బిల్డింగ్ లలో తరగతి గదులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ రెండు విద్యా నియమాలకు విరుద్ధమైనవి. విద్యార్థులకు ప్రమాదకరమైనవి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్రాగడానికి నీరు, వాష్ రూమ్స్, తరగతి గదులలో ఫ్యాన్లు, వెలుతురు లేకుండానే చీకటి గదుల్లో వేలాది మంది విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల పట్ల నిర్లక్ష్యాన్ని వహిస్తూ నాసీ రకమైన విద్యని అందిస్తూ వేలల్లో , లక్షల్లో ఫీజులను విపరీతంగా దండుకుంటున్నారు. మరోపక్క విద్యా సంవత్సరం ముగించక ముందే పాఠశాలు, ఇంటర్మీడియట్ కళాశాలలు చట్ట విరుద్ధంగా కరపత్రాలు,బ్యానర్లు,యాడ్స్ తో ప్రచారం చేస్తూ టీచర్స్ ని, కొంతమంది పిఆర్ ఓ లను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్ క్యాంపియన్ చేయాలంటూ పంపిస్తున్నారు. దీనిని పి డి యస్ యూ విద్యార్థి సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తక్షణమే విద్యాశాఖ అధికారులు,పేరెంట్స్ ప్రమేయంతో ఫీజులు నిర్దేశించాలని, ప్రతి ప్రైవేట్ ,కార్పొరేట్ పాటశాలల్లో పేరెంట్స్ కమిటీ లు నియమించాలని, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న పాఠశాల, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






## రక్తసిక్తమైన రోడ్డు.. ఏడుగురి దుర్మరణం

- పట్నా జిల్లాలో రోడ్డు ప్రమాదం

**నేషనల్ బ్యూరో:** ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరుగురు కూలీలతో వెళ్తున్న ఆటో ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఆరుగురు కూలీలతోపాటు డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. బీహార్ రాష్ట్రం పట్నా జిల్లాలోని మాసౌర్హి నౌబత్‌పూర్ రహదారిపై ధనిచక్‌మోర్ సమీపంలో ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతిచెందిన కూలీలు అంతా పట్నా జిల్లాలోని డోరిపూర్ గ్రామానికి చెందినవారు కాగా.. డ్రైవర్ సుశీల్‌కుమార్ హన్సదిహ్ గ్రామానికి చెందిన వ్యక్తి. ఆరుగురు కూలీలు పనికి వెళ్లి సాయంత్రం ఆటోలో ఇళ్లకు తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటోను లారీ ఢీకొట్టగానే రెండు వాహనాలు రోడ్డు పక్కనున్న లోతైన నీటి గుంతలో పడిపోయాయి. దాంతో జేసీబీల ద్వారా మృతదేహాలను బయటికి తీశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. జేసీబీని రప్పించి నీటి గుంతలో నుంచి మృతదేహాలను బయటికి తీయించారు. అనంతరం పోస్టు మార్టానికి పంపించారు. లారీ డ్రైవర్ మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమైందని పోలీసులు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# కొలువుదీరిన కొత్త ప్రభుత్వం..

## ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యేలు

- సభలో ఎమ్మెల్యే గాప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేఖా గుప్తా
- స్పీకర్ గా విజేందర్ గుప్తా

**నేషనల్ బ్యూరో:** దేశ రాజధాని ఢిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా గత వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఇవాళ నూతన అసెంబ్లీ తొలిసారి సమావేశం అయ్యింది. ఇవాళ ఉదయం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. అంతకంటే ముందు బీజేపీ ఎమ్మెల్యే అర్విందర్ సింగ్ లవ్లీని ప్రొటెం స్పీకర్ గా ఎన్నుకున్నారు. ఉదయం రాజ్ నివాస్‌లో ఆయన చేత లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశాలు ప్రారంభం కాగానే కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణం చేశారు. ఆ తర్వాత మంత్రులు, కొత్తగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం తర్వాత లంచ్ విరామం ఉంటుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సభ మొదలవగానే బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తాను స్పీకర్‌గా ఎన్నుకోనున్నారు. ఇక సమావేశాల రెండో రోజైన ఫిబ్రవరి 25న అసెంబ్లీలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగం ముగియగానే ప్రభుత్వం కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడుతుంది. మూడో రోజైన ఫిబ్రవరి 27న ఉదయం నుంచి గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుంది. చర్చ ముగిసిన తర్వాత డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తారు.



## విదేశాల సహాయంతో దేశాన్ని బలహీనపరుస్తున్నారు

- కుంభమేళాను విమర్శిస్తున్న వారిపై ప్రధాని వ్యాఖ్యలు

**నేషనల్ బ్యూరో:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాను విమర్శిస్తున్న ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. బానిస మనస్తత్వం ఉన్నవారు హిందూమత విశ్వాసాలపై అదే పనిగా దాడిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓ వర్గం నేతలు హిందూమతాన్ని అవహేళన చేస్తున్నారని, విదేశాల దన్నుతో దేశాన్ని బలహీనపరచాలని చూస్తున్నారని మండిపడ్డారు. మహాకుంభమేళా నిర్వహణ ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఇది భావి తరాలకు ఐక్యతాచిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. 'హిందూ విశ్వాసాన్ని ద్వేషించేవారు శతాబ్దాలుగా అక్కడక్కడా ఉంటూనే ఉన్నారు. వీరికి మద్దతివ్వడం ద్వారా విదేశీ శక్తులు కూడా మన దేశాన్ని, మతాన్ని బలహీనపరచాలని చూస్తున్నాయి. సమాజాన్ని విభజించి ఐక్యతను బద్దలు కొట్టడమే వారి ఎజెండా' అని మోదీ విమర్శించారు. కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై మమత, అఖిలేశ్, ఖర్గే విమర్శలు చేసిన నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మహాకుంభమేళాను విజయవంతం చేయడంలో పారిశుద్ధ్య కార్మికులు, పోలీసుల కృషి ఎనలేనిదన్నారు. వేల మంది వైద్యులు, వలంటీర్లు అంకిత భావంతో, సేవా స్ఫూర్తితో పనిచేస్తున్నారని కొనియాడారు.



## 'ఖజానా ఖాళీ చేశారు'..

- మహిళలకు ఆర్థిక సహాయంపై సీఎం కామెంట్స్

**నేషనల్ బ్యూరో:** మహిళలకు ఆర్థిక సాయం పథకం ఏం చేశారంటూ ''ఆమ్ ఆద్మీ పార్టీ'' నిలదీయడంపై ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఘాటుగా స్పందించారు. గత ఆప్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను పూర్తిగా ఖాళీ చేసిందని ఆదివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆమె చెప్పారు. అయినప్పటికీ ఈ పథకాన్ని తాము అమలు చేస్తామని తెలిపారు. 'మహిళా సమృద్ధి యోజన' కింద పేదకుటుంబాలకు చెందిన మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయాన్ని అందిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ వాగ్దానం చేసింది. గర్భిణీలకు రూ.21,000 ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఢిల్లీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై రేఖా గుప్తా మాట్లాడుతూ..."గత ప్రభుత్వం తప్పుకున్న తర్వాత ఆర్థిక పరిస్థితిపై అధికారులతో మేము సమీక్షించాం. ఖజానా పూర్తిగా ఖాళీ అయింది. మహిళా సమృద్ధి యోజన అనేది నిరంతరంగా సాగే ప్రక్రియ. మా సోదరీమణుల కోసం ఉద్దేశించినది. సమగ్రమైన ప్రణాళికతో తప్పనిసరిగా తీసుకువస్తాం'' అని అన్నారు. దీనికిముందు, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం పథకంపై చర్చించేందుకు 'ఆప్' లెజిస్లేటివ్ డెలిగేషన్‌తో ఆదివారం నాడు సమావేశం ఏర్పాటు చేయాలని ఆ పార్టీ నేత అతిషి సీఎంకు లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో మహిళలకు రూ.2,500 ఇస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఫిబ్రవరి 20న జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలో ఈ పథకాన్ని ఆమోదించకపోవడంతో మోదీ గ్యారెంటీని నమ్మి మోసపోయామని ఢిల్లీ ప్రజలు అనుకుంటున్నారని సీఎంకు రాసిన లేఖలో అతిషి పేర్కొన్నారు.

## మహా కుంభమేళాపై అసత్య ప్రచారాలు

- 140 సోషల్ మీడియా అకౌంట్స్ పై కేసులు

**నేషనల్ బ్యూరో:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా మరో రెండు రోజుల్లో ముగియనుంది. 45 రోజుల పాటూ సాగే ఈ కుంభమేళాలో ఇప్పటికే 60 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అయితే, మహాకుంభ్‌పై తప్పుదారి పట్టించే కంటెంట్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారులు చర్యలు చేపట్టారు. మహాకుంభ్‌పై తప్పుదారి పట్టించే కంటెంట్‌ను వ్యాప్తి చేసిన 140 సోషల్ మీడియా అకౌంట్స్‌పై కేసు నమోదు చేసినట్లు మహాకుంభ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వైభవ్ కృష్ణ వెల్లడించారు. ఆయా సోషల్ మీడియా ఖాతాలపై 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఇక ఈ మహాకుంభమేళా ముగింపు రోజు ఫిబ్రవరి 26న జరగనున్న మహాశివరాత్రి పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆరోజు పెద్ద సంఖ్యలో జనం ప్రయాగ్‌రాజ్‌కు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ మేరకు మహాకుంభ్ ప్రాంతంలో ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎంత మంది యాత్రికులు వచ్చినా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ఈ మహాకుంభమేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు.

## తల్లిదండ్రులకు భారం తగ్గించేందుకు పార్ట్‌టైమ్ జాబ్

- కాలేజీ ఫీజు కోసం డెలివరీ బాయ్ అవతారం




**నేషనల్ బ్యూరో:** పార్ట్ టైమ్ జాబ్స్ ఒకప్పుడు ఈ సంస్కృతి అమెరికాలోనే వినిపించేది. ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థులు అక్కడ యూనివర్సిటీల్లో చదువుకుంటూ.. పార్ట్‌టైమ్ జాబ్ చేసుకునేవారు. అయితే, ఇప్పుడు మన దేశంలోనూ విద్యార్థులు ఖాళీ సమయాల్లో నచ్చిన ఉద్యోగాన్ని చేసుకుంటున్నారు. అటు చదువుతో పాటూ.. పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కేందుకు శ్రమిస్తున్నారు. తల్లిదండ్రులకు కొంత మేర భారం తగ్గించేందుకు వారాంతాల్లో ఏదో ఒక పని చేసుకుంటూ కొంత డబ్బు సంపాదించుకుంటున్నారు. ఇలా 20 ఏళ్ల విద్యార్థి కళాశాల ఫీజు కోసం డెలివరీ బాయ్ అవతారమెత్తాడు. న్యూ ఢిల్లీలో స్విగ్గీ డెలివరీ పార్ట్‌నర్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తాజాగా రెడ్డిట్‌లో ఆస్క్ మీ ఎనీథింగ్ సెషన్‌ను నిర్వహించాడు. దీనికి నెటిజన్ల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థి సమాధానాలిచ్చాడు. తను ఎందుకు పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాను, తన సంపాదన, ఇతర వివరాలను పంచుకున్నాడు. ఈ సందర్భంగా ఓ నెటిజన్ కిలోమీటర్‌కు సగటు ఆర్డర్ డెలివరీ ధర ఎంత ఉంటుంది..? అని ప్రశ్నించారు. దీనికి అతడు సమాధానమిస్తూ.. ఒక్కో ఆర్డర్‌కు బేస్ ధర రూ.20 అని డెలివరీ భాగస్వామి వివరించాడు. ఒక ఆర్డర్‌పై 1.5 కిలోమీటర్ దూరానికి రూ.25, 3.2 కి.మీ దూరానికి రూ.35 రూపాయలు, 5.5 కిలోమీటర్లకు రూ.65 రూపాయల వరకూ ఉంటుందని తెలిపాడు. ఇది కేవలం ఢిల్లీలో మాత్రమే అని.. వేర్వేరు ప్రదేశాల్లో ధరల్లో కొంత వ్యత్యాసం ఉంటుందని చెప్పాడు. తాను శని, ఆదివారాల్లో మాత్రమే పనిచేస్తానని వివరించాడు. ఈ లెక్కన నెలకు రూ.6 వేల వరకూ సంపాదిస్తున్నట్లు చెప్పాడు. కానీ రోజంతా పనిచేసే వాళ్లు రోజుకు 1,000 నుంచి రూ.1,500 మధ్య సంపాదిస్తారని వివరించాడు. ముందుగా పాకెట్ మనీ కోసం పార్ట్‌టైమ్ జాబ్ మొదలు పెట్టినట్లు సదరు విద్యార్థి తెలిపాడు. అయితే తర్వాత అది కాలేజీ ఫీజు చెల్లించేందుకు కూడా ఉపయోగపడుతోందని చెప్పాడు. ప్రస్తుతం తన వయసు 20 ఏళ్లని.. తన వయసు పిల్లలు పార్టీలు చేసుకుంటూ జీవితాన్ని ఆస్వాదిస్తున్నారని చెప్పుకొచ్చాడు. కానీ తాను మాత్రం తల్లిదండ్రులకు కాస్త భారం తగ్గించేందుకు పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ చదువుకుంటున్నట్లు వివరించాడు.



## ప్రయాగ్ రాజ్ లో పుణ్యస్నానాలు ఆచరించిన కత్రినా కైఫ్

**నేషనల్ బ్యూరో:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా చివరి దశకు చేరుకుంది. మరో రెండు రోజుల్లో కుంభమేళా ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల తాకిడి పెరిగింది. సామాన్య ప్రజలతోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా మహాకుంభమేళాకు తరలివెళ్తున్నారు. తాజాగా బాలీవుడ్ స్టార్ నటి కత్రినా కైఫ్ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. అక్కడ గంగ , యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా స్వామి చిదానంద్ సరస్వతిని కలిశారు. మరోవైపు భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ సైతం ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. ఈ సందర్భంగా త్రివేణీ సంగమంలో కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ఈ మహాకుంభమేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమం లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ కుంభమేళా ముగియనుంది. ఇప్పటి వరకూ 62 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ ప్రకటించింది.

## రైతులకు ప్రధాని మోదీ అండగా ఉంటారు

- నేడు రూ.22 వేల కోట్ల పీఎం కిసాన్ నిధులు విడుదల
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**, నేషనల్ బ్యూరో:** దేశంలోని రైతులకు ప్రధాని మోడీ అండగా ఉంటారని బీజేపీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలియ జేశారు. నేడు రైతులకు పీఎం కిసాన్ నిధులను ప్రధాని నరేంద్ర మోడీ విడుదల చేయనున్నారు. బీహార్లో ని భాగల్పూర్ లో జరుగనున్న ఓ కార్యక్రమంలో 19వ విడత రైతులకు రూ.22 వేల కోట్ల పీఎం కిసాన్ నిధులను మోదీ విడుదల చేయనున్నారు. పీఎం కిసాన్ నిధుల విడుదలపై బీజేపీ నేత కిషన్ రెడ్డి స్పందించారు. దేశానికి అన్నం పెట్టే ప్రతి రైతుకు అండదండగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఉంటుందని పేర్కొన్నారు. గత 6 సంవత్సరాలుగా రైతులకు ప్రధాని మోదీ రైతులకు ఇస్తున్న భరోసా ఇదని స్పష్టం చేశారు. మధ్యవర్తుల లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో ₹3.5 లక్షల కోట్లు జమ చేస్తున్నామని వెల్లడించారు. ఫసల్ బీమా యోజన కింద రైతులకు పంట భద్రత కోసం ₹1.72 లక్షల కోట్లు చెల్లింపు చేశామని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహిస్తూ పంట ఉత్పత్తికి భరోసా కల్పించేందుకు 25 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తున్నామని అన్నారు. కిసాన్ సమ్మాన్ కింద దాదాపు 85% చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలోని రైతులు పెట్టుబడి ప్రోత్సాహకాలతో, ప్రత్యక్ష ప్రయోజనాలు పొందుతూ.. ధైర్యంగా పంటలు సాగు చేస్తున్నారని కిషన్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్ చేశారు.

## స్కూల్ టీచర్ పాశవిక చర్య

**నేషనల్ బ్యూరో:** ఒక స్కూల్ టీచర్ విద్యార్థిని దారుణంగా కొట్టాడు. అతడి కాలు విరిచాడు. ఇది తెలిసి స్టూడెంట్ తల్లి నిలదీయడంతో చికిత్స కోసం రూ.200 ఇచ్చాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆ ఉపాధ్యాయుడ్ని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం ప్రైవేట్ స్కూల్‌కు చెందిన టీచర్ హర్షిత్ తివారీ క్లాస్‌లో మూడో తరగతి విద్యార్థిని ప్రశ్న అడిగాడు. సమాధానం చెప్పకపోవడంతో పదేళ్ల బాలుడి పట్ల ఆగ్రహం చెందాడు. కులం పేరుతో దూషించాడు. ఆ విద్యార్థిని కొట్టాడు. గోడ కుర్చీ, ఒంగడం వంటి శిక్షలు విధించాడు. ఆ బాలుడి వీపుపై టీచర్ కూర్చొన్నాడు. దీంతో అదుపుతప్పి కిందపడటంతో ఆ విద్యార్థి కాలు విరిగింది. కాగా, ఆ స్టూడెంట్ ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో వారు అతడ్ని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆ బాలుడి కాలు విరుగడంతోపాటు వినికిడి సమస్య వచ్చినట్లు నిర్ధారించారు. విరిగిన కాలుకు కట్టుకట్టారు. మరోవైపు ఆ విద్యార్థి తల్లి స్కూల్‌కు వెళ్లింది. తన కుమారుడిపై దాడి చేసి కాలు విరగ్గొట్టిన టీచర్ హర్షిత్ తివారీని నిలదీసింది.

## విదేశీయులే టార్గెట్ గా పాకిస్థాన్ లో ఉగ్ర ముప్పు



**నేషనల్ బ్యూరో:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కి ఉగ్ర ముప్పు పొంచి ఉందని పాక్ ఇంటలిజెన్స్ వర్గాలు బాంబ్ పేల్చాయి. విదేశీయులే టార్గెట్ గా పలు ఉగ్ర సంస్థలు దాడులకు పాల్పడేందుకు ప్లాన్ వేస్తున్నట్టు పాక్ ప్రభుత్వానికి ఉప్పందింది. ఈసారి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లను తిలకించడానికి వివిధ దేశాల నుంచి భారీగా విదేశీయులు ఇప్పటికే పాక్ చేరుకున్నారు. అయితే ఇపుడు వారి ప్రాణాలకు ముప్పు ఉందని హెచ్చరిస్తున్నాయి నిఘా వర్గాలు. విదేశీయులను కిడ్నాప్ చేసేందుకు ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్ ప్రయత్నిస్తున్నట్టు ప్రభుత్వానికి రహస్య సమాచారం అందినట్టు తెలుస్తోంది. పాకిస్థాన్ లోని ముఖ్య ప్రదేశాలైన ఎయిర్‌పోర్టులు, ఓడరేవులు, ఆఫీసులు, ఖరీదైన నివాస ప్రాంతాలపై ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్ నిఘా వేసిందని ఇంటలిజెన్స్ వెల్లడించింది. ప్రత్యేకంగా పాక్ కు సహాయం చేస్తున్న చైనా, అరబ్ దేశాల నుంచి వచ్చిన వారిని ఉగ్ర సంస్థ లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. దీంతో రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసింది ఆ దేశం. దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది.

## మరోసారి కలుసుకున్న 'మహా' కీలక నేతలు



**నేషనల్ బ్యూరో:** మహారాష్ట్రకు చెందిన శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే మరోసారి కలుసుకున్నారు. కజిన్ సోదరులైన వీరిద్దరూ ఒక పెళ్లి వేడుకలో కలిసి మాట్లాడుకున్నారు. ఆదివారం ముంబైలోని అంధేరీలో జరిగిన ప్రభుత్వ అధికారి మహేంద్ర కళ్యాణ్కర్ కుమారుడి వివాహానికి వారిద్దరూ హాజరయ్యారు. ఉద్ధవ్ ఠాక్రే, ఆయన భార్య రష్మిని రాజ్ ఠాక్రే కలిశారు. అక్కడ కొంతసేపు వారు మాట్లాడుకున్నారు. ఇటీవల పెళ్లి వేడుకల్లో వీరు కలుసుకోవడం ఇది మూడోసారి. కాగా, మహారాష్ట్రలోని అధికార మహాయుతి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటముల్లో విభేదాలు తలెత్తుతున్నాయి. దీంతో ఆయా కూటములు చీలిపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ తమ విభేదాలను పరిష్కరించుకునేందుకు నిర్ణయించుకున్నాయని, రాజకీయంగా విడిపోయిన దాయాది సోదరులైన ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే తిరిగి కలుస్తారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. మరోవైపు 2005లో శివసేన నుంచి బయటకు వచ్చిన రాజ్ ఠాక్రే ఏడాది తర్వాత సొంత పార్టీ ఎంఎన్ఎస్‌ను ఏర్పాటు చేశారు. గత ఏడాది జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష ఎంవీఏలో భాగమైన శివసేన (యూబీటీ) 20 సీట్లు గెలుచుకున్నది. అయితే ఎంఎన్ఎస్ ఒక్క సీటు కూడా గెలువలేకపోయింది. తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన రాజ్ ఠాక్రే కుమారుడు కూడా ఓడిపోయాడు. అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసికట్టుగా పోటీ చేయవచ్చని తెలుస్తున్నది.



హెయిర్ ఫాల్ అనేది చాలా మంది ఎదుర్కొంటున్న సమస్య. ఆహారంలో లోపం, హార్మోనల్ మార్పులు, ఒత్తిడి, జీవనశైలి సమస్యలు, జెనెటిక్ కారకాలతో జుట్టు రాలిపోతుంటుంది. ఈ సమస్యను తగ్గించడానికి హోమియోపతిలో మంచి చికిత్సలు ఉన్నాయని వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు.

# జుట్టు రాలుతోందా... ఇలా చేస్తే ప్రయోజనం

జుట్టు రాలు సమస్యకు అందించే చికిత్సలో హోమియోపతి వైద్య విధానం ఒక వరం అని రుజువు అయ్యింది. హోమియోపతి మందులు సహజంగా రసాయనాలు,స్టెరాయిడ్లు లేకుండా తయారు చేస్తారు. హోమియోపతి వైద్యంలో జుట్టు రాలడానికి గల మూల కారణాన్ని గుర్తించి అందుకు తగిన పరిష్కారాన్ని అందిస్తారు. జుట్టు రాలడానికి గల కారణాన్ని బట్టి హెయిర్ కేర్ తీసుకుంటారు.

ఇప్పటికే ఉన్న లక్షణాలపై దృష్టి పెట్టడమే కాకుండా, రోగులకు సంబంధించిన పలు అంశాలను బట్టి జుట్టు రాలిపోవడానికి కారణాలు, వైద్య చరిత్రను విశ్లేషించి, మానసిక,శారీరక స్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యులు హోమియోపతి మందులను సూచిస్తారు.

**ఈ మందులు జుట్టు మూలాలకు పోషణను అందిస్తాయి. అప్పుడు సమస్యకు సరైన పరిష్కారం అంది జుట్టు పెరుగుతుంది. హెయిర్ ఫాల్ అనేది కొందరిలో వయస్సు పరిమితి లేదు. కాగా హోమియోపతిలో చాలా వరకు జుట్టు రాలడం సమస్యలు తగ్గినట్లు చాలా మంది చెబుతున్నారు. ముఖ్యంగా వారు చెప్పే సూచనలను పాటించడం చేస్తే జుట్టు రాలడం తగ్గి చాలా వరకు ఊడిపోకుండా ఉంటుంది.**




# మధుమేహం అదుపులో ఉంచాలంటే రెండు చిట్కాలు

**మధుమేహం అదుపులో ఉండాలంటే జీవనశైలిలో మార్పులు తప్పనిసరిగా అవసరం. సరిగ్గా నియంత్రిస్తే దీనికి సంబంధించిన సమస్యల నుంచి సులువుగా బయట పడొచ్చు. ఆహారపు అలవాట్లు, జీవన శైలి మార్పులు చేసుకుంటే ఈజీగా రో ు వ్యాధిగ్రస్తులందరూ రాత్రిపూట పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలున్నాయి. మీ బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంచేలా కొన్ని పనులు చేయాలి.**

### శారీరక శ్రమ..

రాత్రి భోజనం చేసిన తర్వాత మంచం మీద పడుకోవడం మీ అలవాట్లలో ఒకటి అయితే, ఇది మీ ఉదయం పూట రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుంది. కాబట్టి తిన్న తర్వాత కనీసం అరగంట లేదా ఒక గంట పాటు ఏదైనా శారీరక శ్రమ చేయడం చాలా ముఖ్యం. ముఖ్యంగా ఒక అరగంట పాటు నడిస్తే ఆరోగ్యానికి చాలా మంచిది.

### యోగా..

యోగా ప్రతి ఒక్కరికీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిక్ సమస్య ఉన్నవారు యోగా చేయడం అలవాటు చేసుకోవాలి. రాత్రి భోజనం చేసిన తర్వాత కొంత సమయం పాటు వజ్రాసనం వంటి యోగాసనాలను అలవాటు చేసుకోవాలి. ఇలా ప్రతిరోజు యోగా చేయడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించడం సాధ్యమవుతుంది.

# ఏ వయసులో ఎన్ని గంటలు నిద్ర అవసరం?

**శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక వ్యక్తికి తగినంత నిద్ర అవసరం. మంచి నిద్ర మిమ్మల్ని రోజంతా శక్తివంతంగా ఉంచడమే కాకుండా మిమ్మల్ని మీ మూడ్ ని బాగు చేస్తుంది. మీరు మంచి అనుభూతి చెందుతూ.. నిద్రలో శరీరంలో ఉత్పత్తి అయ్యే కొన్ని హార్మోన్లు కణాలను సరిచేయడం ద్వారా శరీరం శక్తి వినియోగాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి.**





**సీడీఓ ప్రకారం.. రాత్రికి ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోయే వ్యక్తులు మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల ఆరోగ్యానికి కలిగే హానిని తెలుసుకున్న తర్వాత, ఏ వయస్సులో ఉన్న వ్యక్తి ఎన్ని గంటలు నిద్రపోవాలో ఇప్పుడు తెలుసుకుందా.. నేషనల్ స్లీప్ ఫౌండేషన్ తన అధ్యయనంలో ఎవరూ ఎన్ని గంటలు నిద్రపోవాలనే వివరాలు ఇలా ఉన్నాయి.**

- 0-3 నెలలు: నిద్ర సమయం 14 నుంచి 17 గంటలు ఉండాలి.
- 4-11 నెలలు: 12 -15 గంటలు నిద్రించాలి.
- 14-17 సంవత్సరాలు: 8 -10 గంటలు. 7 గంటల కంటే తక్కువ,11 గంటలకు మించకూడదు.
- 18- 25 సంవత్సరాలు: 7 -9 గంటలు. 6 గంటల కంటే తక్కువ,11 గంటలకు మించకూడదు.
- 26- 64 సంవత్సరాలు: 7 నుంచి 9 గంటలు.
- 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ: 7 నుంచి 8 గంటలు.

**కానీ కొంతమందికి వారి బిజీ లైఫ్‌స్టైల్ లేదా అలవాట్ల వల్ల తగినంత నిద్ర లేనప్పుడు.. వారికి కార్డియోవాస్క్యులర్ డిసీజ్, హై బ్లడ్ ప్రెజర్, డయాబెటిస్, ఒబేసిటీ, డిప్రెషన్, హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.**





## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### 857 పాయింట్లు పతనమైన సెన్సెక్స్




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. వరుసగా ఐదోరోజు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల పవనాలు, ట్రంప్ హెచ్చరికతో మార్కెట్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఫిబ్రవరిలో యూఎస్ వినియోగదారుల సెంటిమెంట్ 15 నెలల కనిష్ఠానికి పడిపోయింది. డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రణాళికలపై ఆందోళనల మధ్య ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. ఈ ప్రభావం భారత్‌పై సైతం పడుతున్నది. గత సెషన్‌తో పోలిస్తే సోమవారం సెన్సెక్స్ 74,893.45 పాయింట్ల నష్టాల్లో మొదలయ్యాయి. మళ్లీ ఏ దశలోనూ కోలుకోలేదు. ఒక దశలో 74,387.44 పాయింట్ల కనిష్ఠానికి పతనమైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 74,907.04 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది.

చివరకు 856.66 పాయింట్ల నష్టంతో.. 74,454.41 వద్ద ముగిశాయి. నిఫ్టీ 243.40 పాయింట్లు పతనమై.. 22,552.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1126 షేర్లు లాభపడ్డాయి. 2,526 షేర్లు పతనమయ్యాయి. విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టాటా స్టీల్ భారీగా నష్టపోయాయి. ఎంఅండ్ఎం, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హీరో మోటోకార్ప్, కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభపడ్డాయి. ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసీజీ మినహా, అన్ని ఇతర రంగాల సూచీలు ఐటీ, మెటల్, టెలికాం సూచీలు 2 శాతం క్షీణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గాయి.

### బేరిష్ ట్రెండ్‌లోనే ట్రేడింగ్!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే నడుస్తున్నాయి. నిజానికి జనవరి నుంచి సూచీలు తీవ్ర ఆటుపోట్లకే లోనవుతున్నాయి. స్థిరత్వం లోపించిందనే చెప్పాలి. అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఇన్వెస్టర్లు ఊగిసలాటకు గురవుతున్నారు మరి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 628.15 పాయింట్లు లేదా 0.82 శాతం పతనమై 75,311. 06 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 133.35 పాయింట్లు లేదా 0.58 శాతం క్షీణించి 22,795.90 దగ్గర నిలిచింది. ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్ర బడ్జెట్, ఆ తర్వాత వచ్చిన ద్రవ్యసమీక్షలో అంచనాలు అందుకోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్ల కోతలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేస్తున్న సుంకాలు.. మదుపరులను పెట్టుబడులకు దూరం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడుదొడుకులకు ఆస్కారముందని మెజారిటీ నిపుణుల అంచనా. ఇక డాలర్‌తో పోల్చితే ఆల్‌టైమ్ కనిష్ఠాల వద్ద కదలాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తూనే ఉన్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమేనని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,100 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,000-23,200 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

### వామ్మో.. సామాన్యులకు కష్టమే..

**11,000 పెరిగిన బంగారం ధర..**



**న్యూఢిల్లీ:** గత సంవత్సరం పెట్టుబడిదారుల జేబులను నింపిన బంగారం.. ఈ సంవత్సరం ప్రారంభంలో కూడా దాని ప్రభావం మరింత కొనసాగించింది. రానున్న రోజుల్లో దేశీయ మార్కెట్లో బంగారం ధరలు లక్ష రూపాయల వరకు వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇది 10 గ్రాములకు 88,000 దాటింది. ఈ సంవత్సరం మొదటి 54 రోజుల్లో బంగారం పెట్టుబడిదారులకు 11 శాతానికి పైగా లాభాన్ని ఇచ్చింది. ఇప్పటి వరకు అంటే ఈ ఏడాది నుంచి 54 రోజుల్లో తులం బంగారం ధర ఏకంగా రూ.11 వేలపైగా పెరిగింది. ఇది మరింత పెరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు.

గత సంవత్సరం బంగారం దాదాపు 30 శాతం రాబడిని ఇచ్చిందని గమనించాలి. ఈ సంవత్సరం దాని ధర మరింత పెరిగింది. కేవలం రెండు నెలల్లోనే 11.20 శాతం పెరిగింది. జనవరి 1న 10 గ్రాముల బంగారం ధర రూ.77,700గా ఉండగా, ఫిబ్రవరి 21 నాటికి అది రూ.88,750కి చేరుకుంది. అంతకుముందు, ఫిబ్రవరి 20న బంగారం ధర రూ. 89,450 వద్ద కొత్త గరిష్ట స్థాయికి చేరుకుంది.

గత నాలుగున్నర దశాబ్దాల అంటే 45 సంవత్సరాల డేటాను పరిశీలిస్తే, బంగారం, వెండి 2024 సంవత్సరంలో అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి. 2007 ప్రారంభంలో బంగారం దాదాపు 31% పెరిగింది. 1979 సంవత్సరంలో 133 శాతం వేగవంతమైన వృద్ధి నమోదైంది. అదే సమయంలో గత సంవత్సరం బంగారం దాదాపు 30 శాతం పెరిగింది. అంటే జనవరి 2024 నుండి ఇది 35 శాతానికి పైగా పెరిగింది.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ నివేదిక ప్రకారం.. ప్రపంచ ఉద్రిక్తతల మధ్య పెరుగుతున్న అనిశ్చితి, సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన కారణంగా బంగారంలో పెట్టుబడి పెట్టే ఆకర్షణ పెరుగుతోంది. అదనంగా ఈ సంవత్సరం ప్రారంభం నుండి డిమాండ్, సరఫరా పరిస్థితి సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ రేటును తగ్గించే అవకాశం, దీపావళి నుండి రూపాయి మారకం రేటులో మూడు శాతం క్షీణత కూడా బంగారం ధరల హెచ్చుతగ్గులలో గణనీయమైన పాత్ర పోషించాయి.

బంగారంలో పెట్టుబడి పెట్టడానికి అనేక రకాల ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఈ పెట్టుబడి ఎంపిక పెట్టుబడిదారుడి ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ తీసుకునే సామర్థ్యం, నగదు అవసరాలు, పెట్టుబడి వ్యవధిపై ఆధారపడి ఉంటుంది. పెట్టుబడిదారులు అధిక ద్రవ్యత, వాణిజ్య సౌలభ్యాన్ని కోరుకుంటే బంగారు మంచివి. ప్రజలు పెట్టుబడిని ఇష్టపడితే, గోల్డ్ మ్యూచువల్ ఫండ్లు మంచివి.

బడ్జెట్‌కు ముందు బంగారం, వెండి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. ఇన్వెస్టర్లు, సాధారణ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ పెరగడంతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో అస్థిరత, అమెరికన్ విధానాల కారణంగా ప్రజలు సురక్షితమైన పెట్టుబడిగా బంగారం కొనుగోలును పెంచుతున్నారు. దీని కారణంగా దాని ధర నిరంతరం పెరుగుతోంది.

## ఛాంపియన్స్ ట్రోఫీలో కివీస్ గెలిచింది...

# పాక్ కథ ముగిసింది!

**బంగ్లాదేశ్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించిన కివీస్**

**237 పరుగుల లక్ష్యాన్ని 46.1 ఓవర్లలో ఛేదించిన వైనం**

**రచిన్ రవీంద్ర సెంచరీ**




**రావల్పిండి:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో సోమవారం న్యూజిలాండ్ జట్టు 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ పై ఘనవిజయం అందుకుంది. తద్వారా సెమీస్ లోకి ప్రవేశించింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన కివీస్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దాంతో మొదట బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 236 పరుగులు చేసింది.

అనంతరం 237 పరుగుల లక్ష్యఛేదనకు బరిలో దిగిన న్యూజిలాండ్ టీమ్ 46.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసి విజయభేరి మోగించింది. కివీస్ ఇన్నింగ్స్ లో రచిన్ రవీంద్ర సెంచరీనే హైలైట్. రచిన్ రవీంద్ర 105 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్ తో 112 పరుగులు చేసి న్యూజిలాండ్ విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు.

టామ్ లాథమ్ 55, డెవాన్ కాన్వే 30, గ్లెన్ ఫిలిప్స్ 21 (నాటౌట్) పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తస్కిన్ అహ్మద్, నహీద్ రాణా, ముస్తాఫిజూర్ రెహ్మాన్, రిషాద్ హసన్ తలో వికెట్ తీశారు.

కాగా, కివీస్ విజయం అనంతరం గ్రూప్-ఏ నుంచి టీమిండియా సెమీస్ బెర్త్ కూడా ఖరారైంది. కివీస్ విజయంతో ఆతిథ్య పాకిస్థాన్ కథ ముగిసింది. పాక్ గ్రూప్-ఏలో ఇప్పటివరకు తానాడిన రెండు మ్యాచ్ ల్లోనూ ఓటమిపాలైంది. ఆ జట్టు ఈ నెల 27న బంగ్లాదేశ్ తో మ్యాచ్ ఆడనుంది. ఇందులో గెలిచినా పెద్దగా ప్రయోజనం లేదు.

ఇక, చెరో రెండు విజయాలతో న్యూజిలాండ్, భారత్ పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచి సెమీస్ బెర్తులు దక్కించుకున్నాయి. మెరుగైన రన్ రేట్ కారణంగా కివీస్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. కివీస్, భారత్ మార్చి 2న తలపడనున్నాయి.




## భారత్‌పై ఓటమితో పాకిస్తాన్ జట్టుపై మాజీల విమర్శలు..

**విరాట్ కోహ్లీని ప్రశంసించిన షోయబ్ అక్తర్..**



**కరాచీ:** ఐసీసీ టోర్నీలో పాకిస్తాన్‌పై తమకు ఎదురే లేదని టీమిండియా మరోసారి నిరూపించింది. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం దుబాయిలో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంలో టీమిండియా సెమీస్ బెర్తును దాదాపు ఖరారు చేసుకోగా.. డిపెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టు దాదాపుగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ పరాజయం పాలవడంతో అటు అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు సైతం సొంత జట్టుపై తీవ్ర విమర్శలకు దిగారు. ఇటీవల కొంతకాలంగా తమ జట్టు భారత్‌పై విజయం సాధించాలని.. చాంపియన్స్ ట్రోఫీని నిలబెట్టుకోవాలని అభిమానులు ఆకాంక్షించారు. అయితే, ఈ చాంపియన్స్ ట్రోఫీలో పాక్ జట్టు భారత్‌పై ఓడిపోవడంతో పాటు చాంపియన్స్ ట్రోఫీలో ఆశలు ఆవిరయ్యాయి. ఈ క్రమంలో మాజీ క్రికెటర్లు వసీం అక్రమం, షోయబ్ అక్తర్, మహమ్మద్ హాఫీజ్, షోయబ్ మాలిక్, మహ్మద్ అమీర్, అహ్మద్ షాజాద్ పలువురు మాజీలు పాకిస్తాన్ జట్టు ఆటతీరుపై విమర్శలు గుప్పించారు. అలాగే, పలువురు ప్రశ్నలు లేవనెత్తారు. పాక్ బోర్డు చెత్త జట్టును ఎంపిక చేసిందని.. దానికి పరిణామాలను అనుభవించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

షోయబ్ అక్తర్ ఏమన్నాడంటే..?

భారత్‌పై పాక్ ఓటమి తర్వాత ఇన్‌స్టా వేదికగా అక్తర్ ఓ వీడియోను షేర్ చేశాడు. పాక్ ఓటమిపై తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. తాను ఓటమిపై విచారం, నిరాశ చెందడం లేదన్నాడు. జట్టులో కనీసం ఐదుగురు స్పెషలిస్ట్ బౌలర్లు లేరని.. అదే తనకు బాధగా ఉందని తెలిపాడు. ఆటగాళ్లకు ఏం చేయాలో తెలియదని.. వారికి ఎలాంటి నైపుణ్యం లేదంటూ విమర్శించారు. వారంతా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ నుంచి నేర్చుకోవాలని.. ఈ మ్యాచ్‌లో ఏం జరుగుతుందో తనకు ముందే తెలుసునని పేర్కొన్నాడు. ప్రస్తుత పాక్‌లోని ఆటగాళ్లకు ఏం చెప్పాలో తెలియడం లేదన్నారు. ఈ సందర్భంగా విరాట్ కోహ్లీని అక్తర్ ప్రశంసించాడు.

## అక్షర్ మెడలో మెడల్ వేసిన శిఖర్




**దుబాయ్:** చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌పై ఇండియా ఇరగదీసింది. ఆ విక్టరీలో విరాట్ కోహ్లీ సెంచరీ ప్రత్యేకమైంది. ఇక టీమిండియా గెలుపులో అక్షర్ పటేల్ కూడా కీలక పాత్ర పోషించాడు. అద్భుతమైన ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో అతనికి ఫీల్డర్ మెడల్ అందజేశారు. మాజీ క్రికెటర్ , మిస్టర్ ఐసీసీగా అవార్డు గెలుచుకున్న శిఖర్ ధావన్ డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చి.. బెస్ట్ ఫీల్డర్ మెడల్‌ను అక్షర్ పటేల్‌కు అందజేశాడు. అక్షర్ పటేల్ ఆ మ్యాచ్‌లో డైరెక్ట్ త్రోతో ఓ రనౌట్ చేశాడు. ప్లేయర్స్ డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిన ప్రజెంటేషన్ సెర్మనీకి చెందిన వీడియోను బీసీసీఐ అప్‌లోడ్ చేసింది.

## చాంపియన్స్ ట్రోఫీకి 'ఉగ్ర' ముప్పు

**పాక్ నిఘా వర్గాల హెచ్చరికలు..!**



**కరాచీ:** పాకిస్తాన్ వేదికగా జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీకి సందర్భంగా ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖొరాసాన్ ప్రావిన్సు ఉగ్రవాదులతో పాటు పలు సంస్థలు దాడి చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో.. భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. చాలా రోజుల తర్వాత పాకిస్తాన్ వేదికగా ఐసీసీ టోర్నీ జరుగుతున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెటర్‌కు పాకిస్తాన్ సురక్షితమైన వేదికగా చాటిచెప్పేందుకు పాకిస్తాన్ బోర్డు ప్రయత్నిస్తుండగా.. భద్రతా ముప్పు పెను సవాల్‌గా మారింది. 2009లో శ్రీలంక క్రికెట్ జట్టుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో పాకిస్తాన్ దశాబ్ద కాలంగా కీలకమైన అంతర్జాతీయ టోర్నీలకు ఆతిథ్యం ఇవ్వలేకపోయింది. తాజాగా చాంపియన్స్ ట్రోఫీకి ఉగ్రవాదుల ముప్పు ఇబ్బందికరంగా మారింది.

ఓ మీడియా కథనం ప్రకారం.. పాక్ ఇంటెలిజెన్స్ బ్యూరో సెక్యూరిటీ అడ్వైజరీ జారీ చేసింది. తెహ్రిక్-ఇ తాలిబాన్ పాకిస్తాన్ (%ూ%), ఐసిస్, బలూచిస్తాకు చెందిన పలు తీవ్రవాద గ్రూపులు టోర్నీకి హాజరయ్యే విదేశీ టూరిస్టులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. చాలా సంవత్సరాల తర్వాత పాకిస్తాన్‌లో క్రికెట్ ఆడేందుకు మళ్లీ వస్తున్నాయి. తాజాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరుగుతున్నది. తాజా భద్రతా సమస్యల నేపథ్యంలో పాకిస్తాన్ హై ప్రొఫైల్ టోర్నీలను నిర్వహించే సామర్థ్యంపై మరోసారి చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే భారత్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే భద్రతా కారణాలను చూపుతూ.. భారత్ ఆ దేశంలో పర్యటించేందుకు నిరాకరించింది. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో దుబాయిలో మ్యాచులు ఆడుతున్నది. టీమిండియా మ్యాచులన్నీ దుబాయిలో జరుగుతుండగా.. మిగతా మ్యాచులకు పాకిస్తాన్ వేదికగా జరుగుతున్నాయి. ఇక నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు స్టేడియాలు, జట్లు బస చేసే హోటల్స్, ఇతర కీలక ప్రదేశాల్లో భద్రతను పటిష్ఠం చేశారు.

చాంపియన్స్ ట్రోపీలో ఆతిథ్య జట్టు పాకిస్తాన్ ప్రారంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 60 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దాంతో సెమీ ఫైనల్స్ ఆశలు దాదాపుగా గల్లంతయ్యాయి. పాకిస్తాన్ టోర్నీలో నిలువాలంటే.. బంగ్లాదేశ్‌పై విజయం సాధించాలి. అదే సమయంలో భారత్ జట్టు న్యూజిలాండ్‌ను ఓడించాలి. న్యూజిలాండ్, బంగ్లాదేశ్ కంటే ఎక్కువగా రన్ రేట్ ఉండేలా చూసుకోవాలి. సోమవారం బంగ్లాదేశ్‌పై న్యూజిలాండ్ గెలిస్తే.. పాకిస్తాన్ అధికారికంగా టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. ఇప్పటికే ఆ జట్టు ప్రదర్శనతో పాకిస్తాన్ అభిమానులు నిరాశకు గురవుతుండగా.. తాజాగా చాంపియన్స్ ట్రోఫీకి ఉగ్రవాదుల ముప్పు వార్తలు ఆతిథ్య దేశానికి మరింత ఇబ్బందికరంగా మారాయి.

# ఒకేసారి రెండు భాషాల్లో తొలి భారతీయ సినిమా

## యశ్‌కు మరో రికార్డు



**టాకీస్:** కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తర్వాత కన్నడ స్టార్ హీరో యశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ టాక్సిక్. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్ కే నారాయణ తెరకెక్కిస్తున్నారు. యశ్ 19వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త అభిమానులు, మూవీ లవర్స్‌ను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ మూవీని ఒకేసారి రెండు భాషల్లో షూట్ చేయనున్నారు. టాక్సిక్‌ను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరించనున్నారు. భారీ స్థాయిలో ఒకేసారి రెండు భాషల్లో తెరకెక్కుతున్న ఇండియన్ మూవీగా నిలువనుంది టాక్సిక్. యశ్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో డబ్బింగ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. లేడీ సూపర్ స్టార్ నయనతార, బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి, తారా సుటారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. బ్రదర్-సిస్టర్ కథతో 1970స్ గోవా, కర్ణాటక బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా సాగనుందని ఇన్‌సైడ్ టాక్. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ లాంటి గ్లోబల్ బ్లాక్ బస్టర్ ప్రాజెక్టు తర్వాత యశ్ కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. ఇప్పటికే మేకర్స్ వింటేజ్ టాక్సీ, రౌండప్ క్యాప్ పెట్టుకున్న యశ్ ఫ్రీ లుక్ విడుదల చేయగా సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది.



# రాజాసాబ్‌లో నా పాత్ర ఎంతో స్పెషల్

## ప్రభాస్‌కు నేను పెద్ద ఫ్యాన్

### మాళవిక మోహనన్

**టాకీస్:** కొత్త పరిశ్రమ, కొత్త భాష అనగానే కాస్త కంగారు పడ్డా. అయితే.. నిదానంగా అలవాటు పడ్డా. కొత్త నగరంలో కొత్త సంస్కృతిని ఆకళింపు చేసుకున్నా. ముఖ్యంగా తెలుగు భాషపై ఇష్టం, ఆసక్తి రెండూ పెరిగాయి. ఆ పదాలు పలికే విధానం, శబ్దం నాకు నచ్చాయి.' అంటున్నది కేరళ కుట్టి మాళవిక మోహనన్. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ 'ది రాజాసాబ్' గురించి ఆమె మాట్లాడింది. అందులో తన పాత్ర గురించీ, అనుభవాల గురించి ఆసక్తికరంగా వెల్లడించింది. "ది రాజాసాబ్' హారర్ కామెడీ మూవీ. ఇప్పటివరకూ నేను చేయని జోనర్. చాలా సినిమాల్లో హీరో పాత్ర ఎదిగే కొద్దీ స్త్రీ పాత్ర తగ్గిపోతూవుంటుంది. కానీ 'ది రాజాసాబ్'లో అలాకాదు. ఇందులో ఆద్యంతం నా పాత్ర బలమైనదే. అద్భుతమైన సన్నివేశాల్లో నటించాను. 'బాహుబలి' నుంచి ప్రభాస్‌కి నేను పెద్ద ఫ్యాన్. ఆయనతో కలిసి పనిచేయాలని కలలు కన్నా. సెట్‌లో ఆయన్ను చూసి ఆశ్చర్యపోయా. అంతపెద్ద స్టార్ చాలా నార్మల్‌గా ఉంటారు.

# ఢిల్లీలో రామ్‌చరణ్ షూటింగ్

## బర్త్‌డే సందర్భంగా టీజర్‌కు ప్లాన్

**టాకీస్:** రామ్‌చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో ఓ స్పోర్ట్స్ డ్రామా సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా తాజాగా హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా చరణ



దివ్యేందులపై క్రికెట్ నేపథ్య సన్నివేశాలు తెరకెక్కించారు. కాగా, తదుపరి షెడ్యూల్ మార్చి తొలి వారం నుంచి ఢిల్లీలో మొదలు కానుందని సమాచారం. ఆ షెడ్యూల్‌లో రామ్‌చరణ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కుస్తీ నేపథ్య సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. కథ పరంగా ఈ సినిమాలో క్రికెట్, కుస్తీతోపాటు మరికొన్ని ఆటలకు ప్రాధాన్యముంది. చరణ్ దీంట్లో అందర్నీ ఆశ్చర్యపరిచేలా ఓ కొత్త క్యారెక్టరైజేషన్‌లో కనిపించనున్నారు. ఈ సినిమాకు 'పెద్ది' అనే పేరుతో పాటు మరో రెండు టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయని తెలుస్తోంది. మార్చి 27న రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా టైటిల్ టీజర్ విడుదలయ్యే అవకాశముంది. ఈ చిత్రానికి రెహమాన్ సంగీత దర్శకుడిగా, రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

# ఇలాంటి అవకాశాలు ఒక్కసారే వస్తాయి : తమన్నా

**టాకీస్:** మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు వర్మతో రిలేషన్ లో ఉంది ఈ బ్యూటీ. ఇటీవల స్పెషల్ సాంగ్స్ లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుందో. రీసెంట్ గా విడుదలైన 'స్త్రీ 2' చిత్రంలో తమన్నా స్పెషల్ సాంగ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఓ వైపు సినిమాలు ,ఆరో వైపు స్పెషల్ సాంగ్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. ప్రస్తుతం తెలుగులో ఓదెల అనే



తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు విజయ్ సినిమా చేస్తుంది. తాజాగా తమన్నా చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. జీవితంలో ఒక్కసారే ఇలాంటి సినిమాల్లో నటించే అవకాశం వస్తుంది. కాశీలో ఈ చిత్రం ప్రారంభించిన నాటి నుంచి ఇందులో మ్యాజిక్ ఉందనే భావన కలిగింది. మేము ఏదైతే మ్యాజిక్ ఫీలయ్యామో ఆడియన్స్ కూడా అదే ఫీలవుతారని ఆశిస్తున్నా అని తమన్నా తెలిపింది.



# ప్రశాంత్‌నీల్ డైరెక్షన్‌లో ఊర్వశీ రౌతేలా ప్రత్యేక పాత్ర

## మొన్న బాబాయ్.. నేడు అబ్బాయ్‌తో నటన

టాకీస్: గత కొద్ది రోజులుగా బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలా పేరు మీడియాలో మారు మ్రోగిపోతోంది. నిజానికి ఊర్వశీ రౌతేలా టాలీవుడ్ లోకి 2023లో అడుగు పెట్టిన ఏడాదే 'వాల్తేర్ వీరయ్య'తో పాటు 'ఏజెంట్', 'బ్రో' , 'స్కంద' మూవీస్ లో స్పెషల్ సాంగ్ లో నర్తించి భారీ ఎత్తున సందడి చేసేసింది. అయితే అప్పటికే ఆమె 'బ్లాక్ రోజ్' అనే ద్విభాషా చిత్రం (తెలుగు, హిందీ)లో హీరోయిన్ గా నటించింది కానీ అదింకా విడుదలకు నోచుకోలేదు. ఇక బాలకృష్ణ సరసన ఏ ముహూర్తాన ఊర్వశీ రౌతేలా 'డాకు మహరాజ్'లో నటించిందో కానీ ఆమె ప్రతి కదలిక అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షించింది. ఆమెతో కలిసి బాలకృష్ణ వేసి స్టెప్పులు సోషల్ మీడియాలో పాజిటివ్ గానూ నెగెటివ్ గానూ కూడా వైరల్ అయ్యాయి. దానికి తోడు ఇటీవల ఈ సినిమా నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కాగానే... ఆమె సన్నివేశాలను, పాటను తొలగించారనే ప్రచారం జరిగిపోయింది. కానీ అందులో నిజం లేదని తెలిసింది. అయితే... ఓటీటీలో వివిధ భాషల్లో స్ట్రీమింగ్ కాగానే ప్రేక్షకులు బ్రహ్మ రథం పట్టేస్తున్నారు. ఇది చాలదన్నట్టుగా ఇప్పుడు ఈ అందాల ముద్దుగుమ్మ జూనియర్ ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీలోనూ ఓ కీలక పాత్ర పోషించబోతోందనే వార్త ఫిల్మ్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది.



# వారే నా బెస్ట్ హీరోయిన్స్ : సమంత

**టాకీస్:** ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో బెస్ట్ హీరోయిన్ ఎవరో సమంత తెలిపారు. పార్వతీ తిరువోతు (ఉల్లొళుక్కు), సాయి పల్లవి (అమరన్), నజ్రియా (సూక్ష్మదర్శిని), అలియా భట్ (జిగ్రా), అనన్య పాండే (సీటీఆర్ఎల్), దివ్య ప్రభ (ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్). వీరంతా రాక్‌స్టార్స్. ఇంకెవరినైనా మర్చిపోయి ఉంటే మరో వీడియో చేసి చెబుతా అని సరదాగా సంభాషించారు. "నెగెటివ్ ఆలోచనలను అధిగమించడానికి ప్రత్యేకంగా చేసేదేమీ లేదని, రెగ్యులర్‌గా చేసే మెడిటేషన్ తదితర వాటి వల్ల నెగెటివిటీ దూరం అవుతుందనుకుంటున్నా" అని తెలిపారు. ఇటీవల కొన్ని రోజులు ఫోన్‌కు దూరంగా ఉన్నా. మొబైల్ లేకపోవడంతో మరో ప్రపంచంలో ఉన్నట్టు అనిపించింది. దానికి ఎంతగా అడిక్ట్ అయ్యామో అర్థమైంది" అని సమంత అన్నారు. ప్రస్తుతం సమంత 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్'లో నటిస్తున్నారు. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్నారు. తన నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌లో 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని గత సంవత్సరం ప్రకటించారు.

## బాలీవుడ్‌లో స్త్రీ పాత్రలకు

# తక్కువ ప్రాధాన్యత : కంగనా

**టాకీస్:** డైరెక్టర్ అనురాజ్ బసు దర్శకత్వం వహించిన గ్యాంగ్ స్టర్ చిత్రంతో కంగనా బాలీవుడ్ తెరంగేట్రం చేసింది. ఇందులో ఆమె నటనకు ప్రసంసలు అందుకుంది. ఆ తర్వాత ఫ్యాషన్ సినిమాతో సూపర్ హిట్ ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా జాతీయ అవార్డు అందుకుంది. హిందీలో క్వీన్, మణికర్ణక, తను వెడ్స్ మను వంటి చిత్రాలతో స్టార్ డమ్ అందుకుంది. తెలుగులో ప్రభాస్ నటించిన ఏక్ నిరంజన్ చిత్రంలో నటించింది కంగనా. ఈ మూవీతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఆమె నటించిన తను వెడ్స్ మను సినిమా రూ.100 కోట్లు దాటిన తొలి హీరోయిన్ సెంట్రిక్ సినిమాగా నిలిచింది. ఇప్పుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. ముక్కుసూటిగా మాట్లాడడంతో బాలీవుడ్ పెద్దలు ఆమెను దూరం పెట్టారు. ఆమెకు అవకాశాలు రాకుండా అడ్డుకున్నారు. దీంతో తనే నిర్మాతగా మారి సినిమాలను నిర్మిస్తుంది. ఇప్పుడు బీజీపీ పార్టీలో చేరింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ లోని మండి నుంచి ఆమె ఎంపిగా పోటీ చేసి ఘన విజయం సాధించింది. తాజాగా బాలీవుడ్ పై షాకింగ్ కామెంట్స్ చేసింది కంగనా. బాలీవుడ్ సినిమాల్లో వివాహబంధాన్ని తప్పుగా చూపిస్తున్నారని ఆమె అన్నారు. అంతే కాదు బాలీవుడ్ సినిమాల్లో స్త్రీల విలువను తగ్గించే సందర్భాలెన్నో చూశాను అని కంగనా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.